మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు సదావకాశం

క్రమబద్ధీకరణపై ప్లాట్ల యజమానులకు అవగాహన కల్పించాలి

మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి ఆదేశం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ సందర్శన

ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై ఆరా

మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 13 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్లాట్ల రెగ్యులరైజేషన్‌కు ఈ నెల 31లోగా ఎల్ఆర్ఎస్‌ను చెల్లించిన వారికి 25% రాయితీ ఇస్తున్న విషయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకునేలా వారికి అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ విజ యేందిర బోయి నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె మహబూబ్‌నగర్ నగరపాలక సంస్థ కార్యాలయంను సందర్శించి ఎల్ఆర్ఎస్ ప్రక్రియపై నగర పాలక సంస్థను సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎల్.ఆర్.ఎస్ రుసుం చెల్లించేందుకు దరఖాస్తు చేసుకున్న లే అవుట్, ప్లాట్ యజమానులకు నగర పాలక సంస్థ మెప్మా ఆర్‌పిల ద్వారా వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి వారికి ఫోన్ ద్వారా సమాచారం అందించి ఏ విధంగా అవగాహన కలిగిస్తున్నారు అడిగి తెలుసుకున్నారు. నగర పాలక సంస్థలో 92 మంది ఆర్.పి.లు వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారికి అవగాహన కలిగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ పై 25 శాతం రిబేటు ప్రకటించడం ప్రజలకు గొప్ప అవకాశం అని,ఇది తిరిగి రాదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రజలకు స్పష్టం చేయాలని చెప్పారు. ఎల్ఆర్ఎస్‌కు సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా వెంటనే నివృత్తి చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ నియమ, నిబంధనల ప్రకారం ఎల్ఆర్ఎస్ రుసుం చెల్లించేలా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, నగర పాలక సంస్థ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను ఆరాధిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

ప్రభుత్వ పాఠశాలల్లో ఏఐ టూల్స్ ద్వారా బోధన చేయాలి

వనపర్తి ప్రతినిధి,మార్చి13 ప్రభాతవార్త:ప్రభుత్వ పాఠశాలల్లో భాష, గణిత విషయాలలో వెనుకబడిన 3,4,5 తరగతుల విద్యార్థులు, వాటిపై పట్టు సాధించేలా ఏఐ టూల్స్ ద్వారా బోధన చేసేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.గురువారం విద్యాశాఖ కార్యదర్శి యోగితా రానా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారితో కలిసి హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ భాష, గణిత విషయాలలో వెనుకబడిన 3,4,5 తరగతుల విద్యార్థులు వాటిపై పట్టు సాధించేలా ఏఐ టూల్స్ ద్వారా బోధన చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 15వ తేదీ నుంచి పైలెట్ ప్రాజెక్టుగా జిల్లాలో ఎంపిక చేయబడిన 11 పాఠశాలల్లో విద్యార్థులకు కంప్యూటర్ ఆధారిత బోధన ప్రారంభం కావాలన్నారు. ఆయా మండలాల ఎంఈవోలు చొరవ తీసుకొని సకాలంలో ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విధానం ద్వారా విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలు పెరిగి భాషలు, గణిత శాస్త్రం పై కొంతమేర పట్టు సాధించే అవకాశం ఉంటుందని చెప్పారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, మహానంది పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు

రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్

సెక్రెటరీ సంజయ్ కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష

వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అధికారులు

గద్వాల, మార్చి 13 ప్రభాతవార్త : యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను ఏటీసీ ఏర్పాటు చేయాలని సంకల్పించిందని, ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఇదే తరహాలో ఐ.టి.ఐ, ఏ.టీ.సీ సెంటర్లు లేని ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ సెగ్మెంట్ లో కనీసం ఒకటి చొప్పున అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏటీసీ సెంటర్ల నిర్మాణానికి అనువైన ప్రదేశం, స్థలాన్ని గుర్తిస్తూ సమగ్ర వివరాలతో కూడిన నివేదికలను త్వరితగతిన సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో సుమారు 45 ఏటీసీ కేంద్రాలను గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలలో నెలకొల్పాలని ప్రభుత్వం నిర్దేశించిందని అన్నారు. రోడ్డు, రవాణా వసతితో పాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటీసీ కేంద్రాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు, ఇన్స్ట్రక్టర్లు సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని సూచించారు. అంతేకాకుండా స్థానిక పరిశ్రమలకు చేరువలో ఏటీసీలను ఏర్పాటు చేసినట్లయితే, సంబంధిత పారిశ్రామిక అంశాలతో కూడిన ట్రేడ్లలో యువతకు శిక్షణ అందించేలా ప్రణాళికలు చేపట్టవచ్చని అన్నారు. తద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే యువతకు స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు లభించేందుకు దోహదపడినట్లు అవుతుందన్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుంటూ అనువైన ప్రదేశాలలో అందుబాటులో ఉన్న స్థలాల వివరాలతో కూడిన నివేదికలను వెంటనే పంపాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ సూచించారు.

జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ మాట్లాడుతూ...జిల్లాలోని అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలలో ఏ.టీ.సీ కేంద్రాల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న మూడు ఎకరాల స్థలాన్ని గుర్తించడం జరిగిందని, పూర్తి వివరాలతో కూడిన నివేదికను సోమవారం లోపు పంపిస్తామని తెలిపారు. జూమ్ మీటింగ్ లో జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వలసల నివారణకు చర్యలు తీసుకోవాలి

- పార్లమెంట్‌లో నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 13 ప్రభాతవార్త:నాగర్‌కర్నూల్ జిల్లాలో వలసలను నివారించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌సభ్యుడు డాక్టర్ మల్లు రవి అన్నారు.పార్లమెంట్ సమావేశాలలో భాగంగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభివృద్ధితోపాటు వలస నివారణ చర్యలకే కేంద్రం ప్రత్యేక పథకాలను అమలు చేయాలని కోరారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతమని, ఉపాధి పనుల కోసం కూలీలు, ఇతర కార్మికులు పొట్ట చేత పట్టుకొని వలస కార్మికులుగా దేశంలోని సుదూర ప్రాంతాలకు వెళ్తున్నారని పార్లమెంట్ దృష్టికి తీసుకువచ్చారు. వలసలను అరికట్టడానికి భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రిని కోరారు. పార్లమెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి పథకాలతో పాటు ఉపాధి కోసం పరిశ్రమలను ఏర్పాటు చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పార్లమెంట్‌లో మాట్లాడుతున్న నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి

ఆశలన్నీ రోబోలపైనే..

సహాయక చర్యల్లో రెస్క్యూ సిబ్బంది

- ప్రమాద స్థలం వరకు ఊహాచిత్రం
- డి1, డి2 ప్రాంతాల్లో సింగరేణి, ర్యాట్ మైనర్స్‌బృందాల సేవలు
- బురద, నీటిని తొలగించేందుకు రోబోల వినియోగం
- 20రోజులుగా టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్
- టీబీఎం భాగాలను తొలగించి లోకో ట్రైన్ ద్వారా బయటికి..

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి 13, ప్రభాత వార్త: ఎస్ఎల్‌బిసి టన్నెల్లో సహాయక చర్యలు నిరంతరంగా కొనసాగుతున్నాయి.ఆశలన్నీ రోబోలపైనే ఉన్నాయి. మానవులు వెళ్లలేని స్థలానికి రోబోలో వెళ్లి రెస్క్యూ చర్యలు నిర్వ హించే అవకాశం ఉన్నది. ప్రమాదం జరిగిన స్థలాన్ని ఊహాచిత్రంగా గీయించి రోబో సహా యంతో మానవ ఆనవాళ్లు గుర్తించే చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఊహాచిత్రం ఆధారంగా ప్రమాద స్థలం వరకు రోబోల ద్వారా తవ్వకాలు జరుగుతున్నాయి. అటానమ స్ హైడ్రాలిక్ పవర్డ్ రోబో ఆర్టిఫిషియల్ ఇంజ లిజెన్స్, ఆల్గారిథమ్ ఆధారంగా తవ్వకాలు జరుపుతున్నాయి. అయితే భరించలేనంత దుర్వాసన వస్తుందని నిపుణులు చెబుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా దోమలపెంట వద్ద ఎస్ఎల్‌బీసీ టన్నెల్ వద్ద గత నెల 22న జరిగిన ప్రమాదంలో 8మంది చిక్కుకోగా పంజాబ్‌కు చెందిన గురుప్రీత్ సింగ్ మృతదేహాన్ని గుర్తించి వెలికితీసి సొంతగ్రామానికి తరలించిన సంగతి తెలిసిందే. మిగతా ఏడుగురి ఆచూకీ ఇప్పటి వరకు లభించలేదు.

డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,గురువారం ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ఆఫీస్‌లో సహాయక చర్యలపై డిజాస్టర్ అండ్ మేనేజ్మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అరవింద్ కుమార్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్, ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

సహాయక చర్యల పురోగతిని సమీక్షించి, తదుపరి చర్యలపై చర్చించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహాయక బృందాలతో ప్రతిరోజు సమీక్ష నిర్వహిస్తూ,ఏరోజుకు ఆ రోజు చేయవలసిన పనులను అధికారులు సహాయక బృందాలకు వివరిస్తున్నట్లు తెలిపారు. సహాయక బృందాలు ఎస్ఎల్‌బీసీ రెస్క్యూ ఆపరేషన్లను 24గంటలు నిరంతరాయంగా కొనసాగిస్తున్నట్లు వివరించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాద ప్రదేశంలో సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ప్లాస్మా కట్టర్స్, థర్మల్ కట్టర్స్ బృందాలు టన్నెల్ బోరింగ్ మిషన్ ప్లాట్‌ఫామ్‌ను కత్తిరించే పనిలో నిమగ్నమై ఉన్నట్లు వివరించారు. టన్నెల్ బోరింగ్ మిషన్ ప్లాట్‌ఫామ్ కటింగ్ పనులు వేగంగా కొనసాగుతున్నట్లు, ప్రమాద ప్రదేశంలో తవ్వకాలు జరుగుతున్న డి1, డి2 ప్రాంతాల్లో సింగరేణి ర్యాట్ మైనర్స్ బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నట్లు తెలియజేశారు. టన్నెల్ లోపల కొనసాగుతున్న సహాయక చర్యల్లో టన్నెల్ బోరింగ్ మిషన్ యొక్క భాగాలను తొలగించి లోకో ట్రైన్ ద్వారా బయటికి తరలిస్తున్నట్లు తెలిపారు. సహాయక చర్యల్లో రోబో వినియోగం తదితర పనులు కూడా కొనసాగుతున్నట్లు తెలియజేశారు. డి1, డి2 ప్రదేశాలకు మరోసారి కేరళకు చెందిన కడవర్ డాగ్స్ స్క్వాడ్‌లను పంపినట్లు తెలిపారు. నిరంతరాయంగా డీవాటరింగ్ ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. సహాయకచర్యల్లో ఆర్మీ,సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం,ఎన్‌డిఆర్‌ఎఫ్,ఎస్‌డిఆర్‌ఎఫ్,ర్యాట్ మైనర్స్, కడవర్ డాగ్స్, హైడ్రా, అన్వి రోబోటిక్స్, బృందాలు సహాయక చర్యల్లో పాల్గొంటున్నట్లు, టన్నెల్ లోపల సహాయక చర్యలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని, తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో, అన్వి రోబోటిక్స్, హైడ్రా అధికారులు,ఆర్మీ,ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ టీం,ర్యాట్ మైనర్స్,దక్షిణ మధ్య రైల్వే,సహ సహాయకచర్యల్లో పాల్గొంటున్న అన్ని బృందాల అధికారులు హాజరయ్యారు.

రెస్క్యూ బృందాలకు నిరంతర భోజన సదుపాయం..

నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, గురువారం నాగర్ కర్నూలు జిల్లా గిరిజన సంక్షేమశాఖ ఫిరంగి,పర్యవేక్షణలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొంటున్న సహాయక బృందాలకు అందిస్తున్న భోజన సదుపాయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు.ఈసందర్భంగా సహాయక బృందాలతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేశారు. గత 19 రోజులుగా సహాయక బృందాల కోసం ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటలవరకు భోజన సదుపాయం అందిస్తున్నట్లు జిల్లాకలెక్టర్ వివరించారు. రెస్క్యూ బృందాలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బందికి భోజన ఏర్పాట్లు నిరంతరాయంగాకల్పిస్తున్నట్లు తెలిపారు.

సమీక్షిస్తున్న నిపుణులు, కలెక్టర్ సంతోష్

మార్చి 19 లోపు రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

నారాయణపేట టౌన్, మార్చి 13 ప్రభాతవార్త :మార్చి 19 లోపు ఓటర్ జాబితా సవరణ, ఇతర అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాల నిర్వహణపై జిల్లా ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వార సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో జిల్లాకలెక్టరేట్ నుంచి అదనపుకలెక్టర్ రెవెన్యూ బెన్ షాలం పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ జిల్లాలో ప్రతి 3 నెలలకు ఒకసారి పకడ్బందీగా అప్ డేట్ కావాలని, నూతనంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక పౌరుడికి ఓటు హక్కు కల్పించాలన్నారు. ఓటర్ జాబితా సవరణ,పోటీ చేసిన అభ్యర్థుల వివరాల సమర్పణ, బూత్ స్థాయి ఏజెంట్ల నియామకం తదితర అంశాలపై జిల్లాఎన్నికల అధికారులు వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో మార్చి 19లోపు సమావేశాల నిర్వహణ పూర్తి చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించే సమయంలో మీటింగ్ మినిట్స్ పకడ్బందీగా నమోదు చేసుకోవాలని, సమావేశానికి హాజరైన ప్రతినిధుల సంతకాలను ప్రత్యేకమైన రిజిస్టర్‌లో తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం మినిట్స్ ఇతర వివరాలను మార్చి 27 లోపు ఎన్నికల కమిషన్‌కు సమర్పించాలని ఆయన ఆదేశించారు.జిల్లా స్థాయిలో కలెక్టర్ ఆధ్వర్యంలో అదే విధంగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెవెన్యూ డివిజన్ అధికారులు, ఏ.ఆర్.ఓ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నిర్వహించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో నూతన ఓటర్ నమోదు, ఓటు బదిలీ, మరణించిన వారి ఓటర్ వివరాల తొలగింపు వివిధ అంశాలకు వాడే ఫారం 6,7,8 వివరాలను పూర్తి స్థాయిలో వివరించాలని అన్నారు. ఈ సమావేశంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణను వేగవంతం చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

నారాయణపేట టౌన్, మార్చి 13 ప్రభాతవార్త : నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణ,కోస్గి రోడ్డు విస్తరణ పనులపై కలెక్టర్ రెవెన్యూ, నీటి పారుదలశాఖ, ఆర్అండ్‌బీ, మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని మక్తల్, నారాయణపేట నియోజక వర్గాలలో భూసేకరణ ప్రక్రియను అధికారులు సమన్వయంతో చేపట్టాలన్నారు. భూసేకరణ ప్రక్రియ ఎంతవరకు వచ్చిందని ఆమె అడిగారు.జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలోమ్ స్పందిస్తూ - మిగతా4లో..

ఆరోగ్యానికి చిరుధాన్యాలు ఎంతో మేలు

మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి.. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై అవగాహన

మహబూబ్‌నగర్బ్యూరో,మార్చి13 ప్రభాతవార్త: చిరుధాన్యాల ఆహారం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని జిల్లాకలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఆహారంతో ఆరోగ్యంలో భాగంగా చిరు దాన్యాల వంటకాల పై శిక్షణా, మానవ అక్రమ నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. చిరు ధాన్యాలతో మిల్లెట్ రాంబాబు 10 రకాల వంటకాలతో డెమో నిర్వహించారు. వంటకాలు మహిళా సభ్యులకు, అతిథులకు వడ్డించారు. మానవ అక్రమ రవాణా ప్రధాన సమస్యగా ఉందని, మహిళ సంఘాల సభ్యులు అప్రమత్తంగా గ్రామ స్థాయిలో మహిళలకు అవగాహన కల్గిస్తూ ఐక్యంగా, సంఘటితంగా సామాజిక రుగ్మతలను రూపుమాపాలని తెలిపారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ నర్సింహులు, అదనపు డిఆర్‌డిఓ జోజప్ప, డిఎఫ్‌ఓ సత్యనారాయణ,జిల్లా సమాఖ్య అధ్యక్షులు రజిత, కార్యదర్శి సుమతి, కోశాధికారి అనిత, డిపిఎం ఎస్.నాగమల్లిక, సీసీలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

మిత్రులకు శిక్షణ.. గ్రామస్థాయిలో సహజ, మానవ కల్పిత విపత్తులను గ్రామస్తులు ఏ విధంగా నివారించాలో అన్ని శాఖలలో ఉన్న ప్రాధాన్యతలను అందరికీ తెలుపుటకు ఆపద మిత్ర వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. గురువారం జిల్లాలో జరుగుతున్న ఆపదమిత్ర వాలంటీర్ల శిక్షణ చివరి రోజు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ విపత్తుల నివారణ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి జిల్లాలో 300 మంది వాలంటీర్లను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు .ప్రకృతి,మానవ కల్పిత విపత్తులు జరిగినప్పుడు అధికారులు సంఘటన స్థలానికి చేరుకునే లోగా పౌరులే స్వయం రక్షణ పద్ధతులను పాటిస్తూ ఇతరుల ప్రాణాలను ఆస్తి నష్టాలు కాకుండా ఏ విధంగా నివారించాలో తెలుసుకోవాల్సిన ప్రాధాన్యత ఎంతగానో ఉందని తెలిపినారు. జిల్లాలో శిక్షణ కార్యక్రమం విజయవంతం చేసినందుకు ఆమె సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ నర్సింహులు, డిఎఫ్‌ఓ సత్యనారాయణ, కలెక్టరేట్ డి సెక్షన్ సిబ్బంది, మాజీ సైనికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విద్య

ఆధునిక సాంకేతిక సహాయంతో ప్రాథమిక విద్య బలోపేతానికి జిల్లా విద్యాశాఖ చర్యలు

- జిల్లాలో 13 ప్రాథమిక పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టు ద్వారా అమలు

నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మార్చి13 ప్రభాతవార్త:నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు నాగర్‌కర్నూల్ జిల్లా విద్యాశాఖ 10 మండలాల్లోని 13 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి కొత్తగా ప్రయోగాలను ఈనెల 15వ తేదీ నుండి ప్రారంభిస్తుంది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల పఠన సామర్థ్యాలను మెరుగుపరిచే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ప్రవేశపెట్టాలని నిర్ణయించబడింది.దీని ద్వారా విద్యార్థుల బుద్ధి వికాసాన్ని పెంపొందించడంతో పాటు, వారి నైపుణ్యాలను మెరుగుపరిచే అవకాశాలు లభిస్తాయని తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి విద్యను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. నాగర్‌కర్నూల్ జిల్లాలోని 10మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్ ద్వారా 13 స్కూళ్లలో అమలుకు జిల్లా విద్యాశాఖ అధికారి అందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసేందుకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఇదివరకే ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏఐ విద్యా ప్రణాళికను ప్రయోగాత్మకంగా మొదట నాగర్‌కర్నూల్ జిల్లాలోని 10మండలాల్లోని 13 ప్రభుత్వపాఠశాలల్లో అమలు చేయనున్నారు. బిజినపల్లి మండలంలోని వట్టెం ప్రాథమిక పాఠశాల, చారగొండ మండలంలోని జూపల్లి ప్రాథమిక పాఠశాల, కోడేరు మండలంలోని కొండ్రావుపల్లి ప్రాథమిక పాఠశాల, కొల్లాపూర్ మండలంలోని ప్రాథమిక పాఠశాల ఎల్లూరు, ప్రాథమిక పాఠశాల ఎన్మనబెట్ల, పెద్దకొత్తపల్లి మండలంలోని ప్రాథమిక పాఠశాల గండ్రావుపల్లి, ప్రాథమిక పాఠశాల చంద్రకల్, పెంట్లవెల్లి మండలంలోని ప్రాథమిక పాఠశాల కొండూరు, తాడూరు మండలంలోని ప్రాథమిక పాఠశాల ఐతోల్, తెల్కపల్లి మండలంలోని ప్రాథమిక పాఠశాల ఆలేరు, తిమ్మాజీపేట మండలంలోని ప్రాథమిక పాఠశాల మారేపల్లి, ప్రాథమిక పాఠశాల చేగుంట, వంగూరు మండలంలోని వంగూర్ ప్రాథమిక పాఠశాలను అధికారులు ఎంపిక చేశారు. ఈ 13 ప్రాథమిక పాఠశాలల్లో 1183 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుండి 5వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విద్యనందించేకు ఎంపిక చేసిన ఒక్కో పాఠశాలల్లో 5 నుండి 10 కంప్యూటర్లను సిద్ధం చేశారు. మొత్తం 13 పాఠశాలల్లో 75 కంప్యూటర్లను, హెడ్ ఫోన్స్, ఇంటర్నెట్ సదుపాయంతో పాటు ఇతర అవసరమైన ఎలక్ట్రానిక్ పరికరాలను ఏర్పాట్లు చేశారు.ఆయా స్కూళ్లలో ప్రత్యేక కంప్యూటర్ ల్యాబ్లు ఏర్పాటు చేసి, విద్యార్థులకు ఎడ్యుటెక్ ఆధారిత శిక్షణ అందించనున్నారు. ఆధారిత లెర్నింగ్ టూల్స్ ద్వారా విద్యార్థుల బలహీనతలను గుర్తించి, వారి సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు టీచర్లు ప్రత్యేక శిక్షణ అందిస్తారు. ఇది విద్యార్థుల వ్యక్తిగత అభ్యాస శైలిను మెరుగుపరచడంలో సహాయపడనుంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా విద్యార్థులకు తక్కువ సమయంలో ఎక్కువ నేర్చుకునే అవకాశం లభిస్తుంది. ఏఐ టెక్నాలజీ సహాయంతో వారు నేర్చుకునే విధానాన్ని విశ్లేషించి, వారికి తగిన మార్గదర్శకత ఇవ్వనున్నారు. దీని ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థులతో పోటీ చేసే స్థాయికి చేరుకుంటారని నిపుణులు అంచనా వేస్తున్నారు. భవిష్యత్తులో ఈ పైలట్ ప్రాజెక్ట్ విజయవంతమైతే, జిల్లావ్యాప్తంగా మరిన్

సొంత నిధులతో ఉపాధ్యాయురాలి నియామకం

సొంత నిధులతో ఉపాధ్యాయురాలిని నియమిస్తున్న వినయ్ కుమార్ రెడ్డి

ఆత్మకూరు, మార్చి 13 ప్రభాతవార్త : ఆత్మకూరు మండలంలోని మూలమల్ల గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో తెలుగు ఉపాధ్యాయురాలు లేకపోవడం చేత విద్యార్థులు తీవ్రంగా నష్ట పోతున్నారని గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించారు. గ్రామం లోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో దాదాపు 300మంది విద్యార్థిని విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్న తరుణం లో తెలుగు ఉపాధ్యాయులు లేకపోవడం చేత గత సంవత్సరం నుంచి విద్యార్థులు నష్టపోతున్నారని ఈ విషయంపై పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదించినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చేత గ్రామ ప్రముఖుల సైతం మిన్న కూడిపోయారు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాత్రం గ్రామానికి చెందిన వినయ్ కుమార్ రెడ్డి ఆత్మకూరు మండల కిసాన్ సెల్ అధ్యక్షులుగా పనిచేస్తున్నటువంటి నేత దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే స్పందించి ప్రతినెలా తాను ఐదువేల రూపాయలు గౌరవేతనంగా ఇచ్చి ఉపాధ్యాయురాలు నియామకంకోసం ముందుకు రావడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాల లో గ్రామానికి చెందిన కుమార్ రెడ్డి 5000 రూపాయల వేతనాన్ని ప్రతినెలా చెల్లించేందుకు ముందుకు రావడం పట్ల ఉపాధ్యాయ బృందం గ్రామానికి చెందిన పలువురు సంతోషం వ్యక్తం చేశారు.

నేరా రహిత సమాజంలో సిసి కెమెరాలు కీలకము

సేకరించిన విరాళాలను టెక్నీషియన్‌కు అందజేస్తున్న గ్రామస్తులు

ఆత్మకూరు, మార్చి 13 ప్రభాతవార్త : ప్రస్తుత సమాజంలో నేర రహిత సమాజాన్ని నిర్మించాలంటే సీసీ కెమెరాల పాత్ర కీలకమని ఆత్మకూర్ ఎస్సై నరేందర్ అన్నారు. ఆత్మకూరు మండలంలోని దేవరపల్లి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటుపై బుధవారం రోజు గ్రామస్తులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ గ్రామంలో చిల్లర దొంగతనాలను కానీ పెద్ద దొంగతనాలను కానీ అరికట్టాలంటే ఒక సీసీ కెమెరాలు 100 మందీ పోలీసులతో సమానమని ఆయన పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని వివిధ గ్రామాలలో గ్రామస్తుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటుకు ఆత్మకూరు పోలీస్ శాఖ చేస్తున్న ప్రయత్నాలకు దేవరపల్లి గ్రామస్తులు కూడా తమ సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎస్సై పిలుపు మేరకు వెంటనే గ్రామ మాజీ సర్పంచ్ మోట్లంపల్లి నాగన్న గ్రామస్తులను ఒప్పించి ఒక లక్షా 12 వేల రూపాయల నగదును విరాళాలు సేకరించి సీసీ కెమెరా టెక్నీషియన్ శ్రీనివాసులకు అందజేశారు.

హోలీ సంబరాలు సామరస్యంగా జరుపుకోవాలి : ఎస్సై

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అమరచింత,మార్చి13ప్రభాతవార్త : నేడు జరిగే హోలీ సంబరాలను సామరస్యంగా జరుపుకోవాలని ఎస్సై, సురేష్ ప్రజలను కోరారు. గురువారం అమరచింత మున్సిపల్ కేంద్రంలోని శ్రీ కృష్ణనగర్ లో కాళికామాత దేవి ఆలయం దగ్గర మహిళలకు, యువకులకు అవగాహన కల్పించారు. హోలీ సంబరాలను మతాలకతీతంగా స్నేహపూర్వకంగా ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ఆయన కోరారు. అలాగే హోలీ సంబరాలలో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన తెలిపారు. అలాగే మహిళల పట్ల ఎవరైనా దురుసుగా ప్రవర్తిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన మహిళలను కోరారు. ప్రతి వాహనదారులు తప్పకుండా హెల్మెట్ తో పాటు వాహనానికి సంబంధించిన లైసెన్స్ తో పాటు ఆర్ సి తప్పకుండా ఉండాలని అలాగే మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని ఆయన అన్నారు. ప్రతి వాహనదారులు హెల్మెట్ ధరించి కుటుంబానికి భరోసా ఇవ్వాలని ఆయన వారిని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందితో పాటు మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

విద్యార్థులు ఉపాధ్యాయులు అయిన దృశ్యం

పెబ్బేరు, మార్చి 13 ప్రభాతవార్త : పెబ్బేరు మండలం బున్యాదిపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులు ఉపాధ్యాయులై పాఠాలు బోధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాగశేషు మాట్లాడుతూ విద్యార్థుల క్రమశిక్షణతో మెలుగుతే జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవచ్చని అదేవిధంగా పాఠశాలలో ఒక ఉపాధ్యాయునిగా విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నప్పుడు కలిగే అనుభూతి చూసిన విద్యార్థులు భవిష్యత్తులో ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకొని భావి భారత పౌరులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో ఉన్నతమైనదని తెలియజేయడం జరిగింది. పాఠశాల హెడ్మాస్టర్ గా భాను ప్రకాష్ ,ఉపాధ్యాయులుగా సింధు శ్రీ ,ప్రణీత ,సిద్దు, అభిరామ్, అభిలాష్, ఆకాష్, ఋషి కుమార్, చరణ్ ,తరుణ్, కీర్తి,గౌతమి,హర్షవర్ధన్ అయ్యారు.ఈకార్యక్రమంలో ఈపాఠశాలలో గతంలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేసిన విశ్రాంత ఉపాధ్యాయులు మైనద్దీన్, ఉపాధ్యాయులు దామోదర్, పాఠశాల ఉపాధ్యాయులు దయానంద్ దొడ్ల ,దుర్గాప్రసాద్, నవాజ్, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ పూర్తయినా విద్యార్థులకు ఒక నెల శిక్షణ

గద్వాల,మార్చి13 ప్రభాతవార్త:బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్‌లో ఒకనెల నాన్ రెసిడెన్షియల్ ఉచిత శిక్షణ కార్యక్రమం ఇవ్వనున్నట్లు టిజిబిసి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమానికి బీసీ అభ్యర్థులు మాత్రమే అర్హులని, డిగ్రీ పూర్తయి 26 సంవత్సరాల కంటే తక్కువ వయసు గలవారు వెబ్సైట్ నందు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా ఈ నెల 15 నుండి వచ్చే నెల ఏప్రిల్ 8 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్లైన్ స్క్రీనింగ్ టెస్ట్ ఏప్రిల్ 12న ఉమ్మడి జిల్లా కేంద్రాలలో నిర్వహిస్తారని, ఆన్లైన్ స్క్రీనింగ్ టెస్ట్ లో వచ్చిన మార్కుల ఆధారంగా 30 మంది అభ్యర్థులను ఎంపిక చేసి ప్రైవేట్ బ్యాంకుల్లో ప్లేస్మెంట్ అవకాశం కల్పిస్తారనీ తెలిపారు. అభ్యర్థుల యొక్క తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతంలో రూ.2లక్షలలోపు ఉండాలని సూచించారు. మరింత సమాచారం కొరకు ఫోన్ నెంబర్ 0402930 31301 లేదా 9985434941 ను సంప్రదించగలరని కోరారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఈ ప్రకటన ద్వారా తెలియజేశారు.

మిగిలిపోయిన సీట్లకు నోటిఫికేషన్ విడుదల

అచ్చంపేట, మార్చి 13 ప్రభాతవార్త: మహాత్మ జ్యోతిరావు పూలే తెలంగాణ బీసీ గురుకులంలో 6,7,8,9 తరగతి లో 2025-26, విద్యా సంవత్సరా నికి మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల అయ్యిందని వెల్టూర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్.యామిని తెలిపారు. గురువారం ప్రిన్సిపాల్ యామిని మాట్లాడుతూ.. మహాత్మ జ్యోతిరావు పూలే బిసి వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో మిగిలి పోయిన సీట్లకు నోటిఫికేషన్ విడుదలై నట్లు దరఖాస్తు చేసుకోవడానికి మార్చ్ 6 2025 నుండి మార్చ్ 31 వరకు ఉందని దరఖాస్తు ఫీజు రూ.150లు మాత్రమే అని ఆమె తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఏప్రిల్ 2025 రోజు పరీక్ష ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసుకోవడానికి కావాల్సినవి భోనఫైడ్, ఆధార్ కార్డ్, అభ్యర్థి ఫోటో, సంతకం, ఫోన్ నెంబర్, ఇమెయిల్ ఐడి కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం ఉండాలని ఆమె సూచించారు. 6వ తరగతి ప్రవేశానికి 12 సంవత్సరాలు మించకూడదని ఇందులో ఎస్సీ, ఎస్టి విద్యార్థులకు రెండు సంవత్సరాలు సడలింపు ఉంటుందని ఆమె తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రపంచ కిడ్నీ దినోత్సవం

కల్వకుర్తి, మార్చి 13 ప్రభాతవార్త:కల్వకుర్తి పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో గల డయాలసిస్ సెంటర్‌లో ప్రపంచ కిడ్నీ దినోత్సవం గురువారం డయాలసిస్ రోగుల సమక్షంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివరాం, నర్సింగ్ సిబ్బంది, డయాలసిస్ సెంటర్ సిబ్బందితో కలిసి కేక్ కటౌచేసి రోగులకు కిడ్నీలపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. సమాజంలో చాలామంది మధ్యం, ధూమపానం వాటికి బానిసలుగా మారి శరీరంలో తగినంత నీటి శాతం చూసుకోకుండా డిహైడ్రేషన్ ఎక్కువ అవ్వడం వల్ల కిడ్నీలు పాడవుతున్నాయన్నారు. అధికంగా నీరు తాగాలని, డాక్టర్ సలహా లేకుండా కిడ్నీని నశింపజేసే మందులు తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారం కోసమే మార్నింగ్ వాక్

ప్రయాణికుల దాహార్తి పై ధ్యాస లేని ఆర్టీసి అధికారులు

మార్కెట్ గోదాం ప్రమాద నిందితులెవరో

తెలిసినా ఎందుకు పట్టుకుంటలేరు?

ప్రభుత్వ ఆస్తి కాబట్టి డబ్బులు రావని మట్టుగున్నారా?

బీసీ పొలిటికల్ జెఎసి స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

బాధితురాలు సమస్యలు తెలుసుకుంటున్న రాచాల యుగంధర్

పెబ్బేరు,మార్చి13 ప్రభాతవార్త:ప్రజల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకే మార్నింగ్ వాక్ చేస్తున్నామని బీసీ పొలిటికల్ జేఏసీ స్టేట్ ఛైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ అన్నారు. మార్నింగ్ వాక్‌లో భాగంగా గురువారం పెబ్బేరు పట్టణానికి విచ్చేసిన ఆయనకు స్థానిక ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో పూజలు చేసి మార్నింగ్ వాక్ ప్రారంభించారు. సుభాష్ చౌరస్తాలో సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి అక్కడి నుంచి పెబ్బేరు మార్కెట్ యార్డులో ఏడాది క్రితం కాలిపోయిన గోదాంను పరిశీలించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండును సందర్శించి ప్రయాణికులతో మాట్లాడి, తాగునీటిని పరిశీలించారు. అక్కడి నుంచి సర్వే నంబర్లు 455, 456లలో బీసీలు వేసుకున్న ప్లాట్ల రాళ్లను పట్టణానికి చెందిన ఇద్దరు రెడ్డి సామాజిక వర్గం వారు పీకేస్తున్నారని ఫిర్యాదులు అందడంతో ఆ ప్లాట్లను ఆయన పరిశీంచి రాళ్లు పాతించారు. అనం తరం రాచాల మాట్లాడుతూ మార్కెట్ యార్డు గోదాంలు కాలిపోయి సంవత్సరం కావస్తున్నా పెబ్బేరు పోలీసులు ఎందుకు పట్టుకోవడం లేదని ప్రశ్నించారు. కాలిపోయింది ప్రభుత్వ ఆస్తి కనుక డబ్బులు రావని, ప్రైవేటు ఆస్తులైతే నేరస్థుల వద్ద, బాధితుల వద్ద రెండు వైపుల నుంచి లంచం తీసుకోవచ్చు దీనికైతే ఎవరూ లంచం ఇవ్వరని పెబ్బేరు ఎస్సై నిందితులను పట్టుకోవడం లేదని ఆరోపించారు. చాలా కేసుల్లో విదేశాల్లో ఉన్న నిందితులను పట్టుకుంటున్న పోలీసులు నిందితులెవరో ప్రాథమికంగా తెలిసినా ఇంతవరకు ఎందుకు పట్టుకోవడంలేదని, నిందితులకు అండగా ఉంటున్న నాయకులు ఎవరు? ఆ నేతలెవరో తేల్చాలని డిమాండు చేశారు. దీనిపై కొత్తకోట సీఐ, వనపర్తి డీఎస్పీ, ఎస్పీలు నోరు మెదపడంలేదని, అందుకే పెబ్బేరు ఎస్సైపై రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేసుకోవడానికే గోదాంలను కాల్చారని, ఇన్సూరెన్స్ క్లెయిమ్ చేయవద్దని కోరారు. అదేవిధంగా లంచావతారి అయిన పెబ్బేరు ఎస్సై హరిప్రసాద్ రెడ్డిపై విచారణ జరిపి ఆయనను సస్పెండ్ చేయాలని కోరారు. పెబ్బేరు ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఆర్టీసీ అధికారులపై ప్రయాణికుల భద్రతపై ధ్యాస లేదని, వారికి ఎదురవుతున్న ఇబ్బందులపై దృష్టి పెట్టడం లేదన్నారు. పెబ్బేరు బస్టాండులో ప్రయాణికులకు తాగడానికి గుక్కెడు మంచినీరు దొరకడంలేదని,ఆర్టీసి ఏర్పాటుచేసిన నల్లానుంచి ఉప్పు నీరు వస్తోందన్నారు. అలంకార ప్రాయంగా నల్లాలు ఏర్పాటు చేశారని, మంచి నీరు వస్తున్నాయా ఉప్పు నీరు వస్తున్నాయా అని చూసేవారే లేరని ఫైర్ అయ్యారు. అదేవిధంగా ఏపీ బస్సులు రాత్రి సమయాల్లో పెబ్బేరు గుండా వెళ్లకుండా బైపాస్ మీదుగా వెళ్తుండటంతో మన ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారికి మన రాష్ట్ర రోడ్ల మీద తిరిగి ప్రయాణికుల నుంచి వచ్చే ఆదాయం కావాలి కాని, ఇలా రాత్రి సమయాల్లో పెబ్బేరు, కొత్తకోట అంటేనే చీదరించుకుంటున్నారని, దీనిపై ఆర్టీసీ అధికారులు ఏపీ వాళ్లతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పెబ్బేరు మున్సిపాటీలోని సర్వే నంబర్లు 455, 456 లలో ప్లాట్లు కొన్న యజమానులు రాళ్లు పాతుకుంటే వాటిని పెబ్బేరుకు చెందిన నరసింహా రెడ్డి, వర్ధన్ రెడ్డి (సచివాలయంలో హోంశాఖ ఉద్యోగి) తొలగించగా వాటిని స్వయంగా యజమానులతో రాచాల యుగంధర్ గౌడ్ పాతించారు. అధికారం చేతిలో ఉందని వర్ధన్ రెడ్డి అనే వ్యక్తి మాటిమాటికి ప్లాట్ల యజమానుల జోలికి వస్తే ఊరుకునేది లేదని, అతనిపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి చర్యలు తీసుకునేలా చూస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఎసి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్, రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు స్వప్న, నరసింహా, బత్తుల జితేందర్, రాఘవేందర్ గౌడ్, అంజన్న యాదవ్, మహిందర్ నాయుడు, దేవర శివ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బూర్గుల రామకృష్ణారావు జయంతి

బూర్గుల రామాకృష్ణారావు విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

జడ్చర్ల, మార్చి 13 ప్రభాతవార్త : డాక్టర్ బూర్గుల రామకృష్ణారావు జయంతిని పురస్కరించుకుని కళాశాలలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల ఆవరణలో ముళ్లచెట్లను తొలగించి చెత్త చెదారంను తీసివేశారు. కళాశాల ఆవరణలో పరిశుభ్రంగా ఊడ్చారు. తదనంతరం కళాశాల ఆవరణలో ఉన్న బూర్గుల రామకృష్ణారావు విగ్రహానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య మాట్లాడుతూ బూర్గుల రామకృష్ణారావు హైదరాబాద్ కు తొలి ముఖ్యమంత్రిగా సేవలు అందించారు అని, స్వతంత్ర్య ఉద్యమంలో ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని రెండు సార్లు జైలుకు వెళ్లి వచ్చారని, పెద ప్రజలకు భూములను పంచి పెట్టారని చెప్పారు. అలాగే నిజాం నవాబుకు వ్యతిరేకంగా ఉద్యమించి విజయం సాధించి, హైదరాబాద్ కు తొలి ముఖ్యమంత్రిగా నియామకమై 1952 నుంచి 1956 వరకు విశిష్ట సేవలు అందించి 1967 సెప్టెంబర్ 14 న గుండెపోటుతో మరణించారని ఆయన సేవలను ప్రభుత్వం గుర్తించి ఆయన పెరు మీద డాక్టర్ బీ.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ను స్థాపించి పెద విద్యార్థులకు విద్యను అందించి, ఉజ్వల భవిష్యత్తుకు బాట వేస్తుందని కొనియాడారు. అలాగే చరిత్ర అధ్యాపకుడు రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ బూర్గుల రామకృష్ణారావు బహుభాషా కోవిదుడు, స్వతంత్ర్య సమరయోధుడు, రచయిత ఐన ఆయన బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడి జైలుకు వెళ్లారని, రెండో అధ్ర మహాసభ దేవరకొండ లో జరిగినప్పుడు అధ్యక్షత వహించి తెలుగు ప్రజల గొప్పతనాన్ని చాటిచెప్పాడు. హైదరాబాద్ ఇండియన్ యునియన్ లో విలీనమైన తరువాత వెల్లోడి ప్రభుత్వ హయంలో రెవెన్యూ మంత్రిగా నియామకంపై ఆచార్య వినోబాబావే చేపట్టిన " భూదానోద్యమంకు సహకరించి, చట్టబద్ధత కల్పిస్తూ పెద ప్రజలకు ఉచితంగా భూములను పంచిపెట్టారని, 1952 లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో షాద్‌నగర్ నుంచి పోటీచేసి యం.యల్.ఏ గా విజయం సాధించి, హైదరాబాద్ తొలి ముఖ్యమంత్రి గా నియామకమై 1956 వరకు సేవలు అందించారు. ఆ తరువాత కేరళ, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి గవర్నర్ గా సేవలు అందించారు. ఈ కార్యక్రమాల్లో కలశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుకన్య వైస్ ప్రిన్సిపాల్ నర్మదా, శ్రీనివాసులు, అధ్యాపకులు రాఘవేంద్ర రెడ్డి, సదాశివయ్య, నంద కిషోర్, మాధురి, సతీష్, నర్సింలు, నరసింహారావు, పుష్పాలత, వెంకటయ్య, నాగరాజు, నాగలక్ష్మి, సులేమాన్ ,వెంకట్ రెడ్డి, వేణు, రుక్యాబాను, సూరయ జాబిన్, యన్.యస్.యస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

కళాశాల ఆవరణలో స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న ఫోటో

అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత చట్టం అమలు చేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి, కే సూర్యం

అమరచింత, మార్చి 13 ప్రభాతవార్త : దేశంలో వివిధ రంగాలలో పనిచేస్తున్న అసంఘటి కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సామాజిక భద్రత చట్టం అమలు చేయాలని టియుసిఐ రాష్ట్ర కార్యదర్శి, కే సూర్యం డిమాండ్ చేశారు. గురువారం అమరచింత మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో టియుసిఐ జిల్లా కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత కార్మికులకు కనీస వేతనాలు పెంచుతామని 2021లో ఐదు జీఓలను విడుదల చేసిన ఇప్పటి వరకు అమలు చేయడం లేదని ఆయన అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గ్రామ పంచాయతీలో పని చేస్తున్న 60 వేల మంది సిబ్బంది గ్రామాలు పరిశుభ్రంగా ఉంచుతున్న వారికి కనీస వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వివిధ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్న కార్మికులకు నెలకు కేవలం 3000 మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుందని మధ్యాహ్న కార్మికులకు కనీస వేతనాలు లేక అప్పుల పాలై ఇబ్బందులకు గురవుతున్నారని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వారికి కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులు ఉన్న బీడీ కార్మికులకు కనీస వేతనాలు బీడీ యజమాన్యాలు అమలు చేయడం లేదని అలాగే ఆసర్ పెన్షన్లు బీడీ కార్మికులకు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేజీబీవీ, హమాలి, మోటారంగం, భవన నిర్మాణం ప్రభుత్వ ఆసుపత్రి లో పనిచేస్తున్న కార్మికులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కార్మికులకు సంక్షేమాలు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టియుసిఐ వనపర్తి జిల్లా అధ్యక్షుడు అరుణ్ కుమార్, హనుమంతు, ప్రసాద్ ,సామెల్ ,సిరాజు ,చెన్నయ్య, గణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీరాకేఫ్‌ను గీత ఆర్థిక సహకార సంస్థకు బదిలీ చేస్తూ నిర్ణయం

సమావేశంలో మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

పెబ్బేరు, మార్చి 13 ప్రభాతవార్త : టూరిజం శాఖ పరిధిలో ఉన్న నీరా కేఫ్, దాని ఆస్తులను తెలంగాణ రాష్ట్ర కల్లు గీత ఆర్థిక సహకార సంస్థకుకి బదిలీ చేస్తూ నిర్ణయం. డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో గురువారం దీనికి సంబంధించిన ఒప్పంద పత్రంపై పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తో కలిసి సంతకాలు చేసిన బి.సి రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ కి ధన్యవాదములు కృతజ్ఞతలు తెలియచేస్తున్నామని గౌడ జన గీత కార్మిక తెలంగాణ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఎస్. రామన్ గౌడ్, వనపర్తి జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మీరు చేసినా ఈ మేలు ఈ గౌడ సమాజం ఎప్పటికి మరువదు. ఇప్పటి దాకా టూరిజం శాఖ పరిధిలో ఉన్న నీరాకేఫ్ ఇక నుండి కల్లు గీత ఆర్థిక సహకార సంస్థ ఆధ్వర్యంలో నడవనుంది. అయితే ఈ పర్యటక శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న నిరా కేఫ్ గీత ఆర్థిక సంస్థ కార్పొరేషన్ కు బదిలీ చేయాలని పోరాటం చేసినా రాష్ట్రములో ఉన్న అన్ని గౌడ కుల సంఘాల పెద్దలకు నా ధన్యవాదములు తెలియజేశారు. మీ పోరాటం వలనే ఇది సాధ్యం అయింది. అలాగే హైదరాబాద్ ట్యాంక్ బండి పై సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఏర్పాటు చేయాలి. జనగాం జిల్లా కు పాపన్న గౌడ్ పేరు పెట్టాలని గీత కార్మికులకు ఉపయోగపడే 560 జీఓను అమలు చేసి పెద్ద గ్రామాలకు 10 ఎకరాల భూమి 10 లక్షలు, చిన్న గ్రామానికి 5 ఎకరాల భూమి 5 లక్ష లు కేటాయించి ఈత, తాటి వనం పెంచడం కోపం కేటాయించాలని విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్ గౌడ్ నాయకులు ఎన్. జనార్దన్ గౌడ్ ,పబ్బ శేఖర్ గౌడ్ కే. బస్వరాజు గౌడ్, రంగస్వామి గౌడ్, కే. వెంకటయ్య గౌడ్, రాజు గౌడ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులను పర్యవేక్షించిన గ్రామీణ అభివృద్ధి అధికారి ఉమాదేవి

పనులను పర్యవేక్షిస్తున్న గ్రామీణ అభివృద్ధి అధికారి

పెబ్బేరు, మార్చి 13 ప్రభాతవార్త : పెబ్బేరు మండలంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి పి.ఉమాదేవి ఉపాధి హామీ పనులను పరిశీలించడం జరిగింది. అందులో భాగంగా గురువారం రంగాపురం గ్రామంలో నర్సరీను, రైతు పొలములో జరుగుతున్న భూమి చదును పనులను పరిశీలించారు. అదేవిధంగా తోమాలపల్లి గ్రామంలో కోళ్ల పెంపకం యొక్క షెడ్ ను పరిశీలించారు. రెండు మండలాలకు సంబంధించిన శ్రీరంగాపురం, పెబ్బేర్ మండలాలకు సంబంధించిన ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు పెబ్బేరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పనులపై, స్వచ్ఛ భారత్ మిషన్ పనులను గురించి సమీక్ష జరపడం జరిగింది. అందులో భాగంగా ప్రతి గ్రామ పంచాయతీకి 50 మంది ఉపాధి కూలీలు పనులకు వచ్చే విధంగా పని కల్పించాలని తెలియజేశారు. అదేవిధంగా పనులు జరుగుతున్న ప్రదేశంలో ఉపాధి కూలీలకు త్రాగునీరు షెడ్ నెట్టును ఏర్పాటు చేయవలసిందిగా పంచాయతీ కార్యదర్శులకు ఉపాధి హామీ ఫీల్డ్ సిబ్బందికి సిబ్బందికి ఆదేశించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రవీంద్ర ఎంపీ ఓ రోజా ,ఏపీఓలు నరసింహారెడ్డి, ఈసీలు టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్లు పంచాయతీ కార్యదర్శులు అందరూ పాల్గొనడం జరిగింది.

ఘనంగా కవయత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు

మొల్లమాంబ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

జడ్చర్ల, మార్చి 13 ప్రభాతవార్త:జడ్చర్ల పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో గురువారం కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటగా ఆమె చిత్ర పటానికి కౌన్సిలర్ కే.నవనీత, శాలివాహన సంఘం సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మొల్లమాంబ మా కుమ్మర ఆడపడుచు అని, రామాయణాన్ని తెలుగులో రచయించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుమ్మర సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కే కొండల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్లప్ప, గంగాపురం కుమార్, ప్రవీణ్, శివ దర్శన్, రవి తేజ, రమేష్, రాఘవేందర్, కృష్ణ, నాగరాజు, శ్రీను, మల్లేష్, జనార్ధన్, మధు, గణేష్ తిరుమలేష్, హరీష్, సందీప్, శ్రీకాంత్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మంగం పేటలో స్వయం పరిపాలన దినోత్సవం

మల్దకల్, మార్చి 13 ప్రభాతవార్త : జోగ

రక్తదానం జీవిత విధానం కావాలి

-లయన్స్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ

రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న దృశ్యం

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మార్చి13 ప్రభాతవార్త: రక్తదానం జీవిత విధానంలో భాగంగా మల్చుకోవాలని లయన్స్ మాజీ గవర్నర్ రాధాకృష్ణ పిలుపునిచ్చారు. గురువారం నాగర్ కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల భాగస్వామ్యంతో, లయన్స్ క్లబ్ మరియు రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరమును రాధాకృష్ణ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థి దశలోనే రక్తదానాన్ని అలవాటుగా చేసుకుంటున్న కళాశాల విద్యార్థులను అభినందనీయమని, 18 సంవత్సరాల వయస్సు పూర్తి అయి యాభై కిలోల బరువు వున్న ప్రతి వ్యక్తి రక్తదానం చేయవచ్చని, దానమిచ్చిన రక్తం ఆరు గంటలలోపు తయారవుతుందని, కొత్త రక్తం రావడం వల్ల మనిషిలో చురుకుదనం పెరుగుతుందని తెలిపారు. ఎండలు ముదురుతున్న సందర్భంలో విద్యార్థులు ధైర్యంగా ముందుకు రావడం సంతోషకరమని, రక్తం డబ్బుతో తయారు చేయలేమని, కేవలం దాతల ద్వారానే లభిస్తుందని తెలిపారు. జిల్లా కేంద్రంలోని బ్లడ్ బ్యాంకులో ప్రస్తుతం రక్తం స్టాక్‌లేదని, ఈ రోజుమీ క్యాంపు ద్వారా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకుఅవసరమైన రక్తం దొరుకుతుందని, మీరు ప్రతి ఆరు నెలలకి ఒక సారి రక్తదానం చేయడం అలవాటుగా మార్చుకొని నిరుపేదలకు సహాయ పడాలని కోరారు. శిబిరంలో 55 మంది కళాశాల విద్యార్థిని, విద్యార్థులు రక్తదానం చేశారు. ఈ శిబిరంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ రాధాకృష్ణతో పాటు బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి డాక్టర్ రోహిత్, రెడ్ క్రాస్ సెక్రటరీ రమేష్‌రెడ్డి, లయన్స్ అధ్యక్షులు రాధారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అంజయ్య, శిబిర సమన్వ య కర్త డాక్టర్ కోదండ రాములు, రీజియన్ చైర్మన్ తెప్ప శ్రీను, మాజీ అధ్యక్షులు హకీమ్ విశ్వ ప్రసాద్, రాజవర్ధన్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రేమకుమార్‌రెడ్డి, రామకృష్ణ రెడ్డి, కార్యదర్శి వాసలక్ష్మి, కోశాధికారి నాగరాణి, సభ్యులు శైలజ, లక్ష్మి, రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ సభ్యులు కృష్ణారావులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి యూనిట్లకు ధ్రువపత్రాల పరిశీలన

ఇటిక్యాల, మార్చి 13 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు స్వయం ఉపాధిని ద్వారా యూనిట్లను నెలకొల్పి వారి జీవన ప్రమాణాలను పెంచేందుకుగాను ఆన్‌లైన్ యూనిట్ల కోసం దివ్యాంగుల నుండి దరఖాస్తులు చేసుకున్నారు. ఉమ్మడి ఇటిక్యాల మండలం నుండి 58 మంది దరఖాస్తులు చేసుకోగా గురువారం గురువారం ఇటిక్యాల మండల పరిషత్ కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ సిడిపిఓ సుజాత, అంగన్వాడి సూపర్‌వైజర్ మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ జయరాములు, జూనియర్ అసిస్టెంట్ రాజవర్ధన్ గౌడ్‌లు, దివ్యాంగులకు ధృవపత్రాలను పరిశీలించారు. సదరం సర్టిఫికెట్లలో పర్సంటేజి, కులం, ఆదాయం ఇతర పత్రాలు అలాగే వ్యాపారంలో అనుభవం వంటివి పరిశీలించారు. 58 మంది దరఖాస్తుదారులు చేసుకోగా ధృవ పత్రాల పరిశీలనకు ఉమ్మడి మండలం నుండి 7 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు.

జ్ఞాన సమాజ నిర్మాణం కొరకే భీమ్ దీక్ష

భీమ్ దీక్ష ప్రారంభ గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కల్వకుర్తి, మార్చి 13 ప్రభాతవార్త: జ్ఞాన సమాజ నిర్మాణం కోసమే భీమ్ దీక్ష కార్యక్రమం అని స్వేరో సీనియర్ నాయకులు దుబ్బ నాగేష్ పేర్కొన్నారు. గురువారం కల్వకుర్తి మండలంలోని జిల్లెల్ల, మార్చాల గ్రామాల్లో భీమ్ దీక్ష ప్రారంభ గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీం వేరు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, అక్షరం, ఆర్థికం, ఆరోగ్యం అనే ప్రధాన అంశాలతో యువతను ముందుకు నడిపిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఈనెల 15న ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో నెలరోజుల పాటు జరిగే పవిత్ర మాసమైన స్వేరో భీమ్ దీక్షా కార్యక్రమం ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి స్వేరోలు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని ముందుకు తీసుకెళ్ళేందుకు సేవలు నిరంతరం కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. భీమ్ దీక్షను చేపట్టే వారంతా నీలిరంగులు, చొక్కాలు ధరించి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని నాగేష్ తెలిపారు. దీక్ష స్వీకరించిన సభ్యులు ప్రతిరోజు తమకు నచ్చిన గ్రామానికి వెళ్లి అక్కడ పేదరికంలోఉన్నవారికి తమకు తోచినంత సహాయం చేసి, అంబేద్కర్ వారి కోసం అందించిన హక్కులను తెలియజేయడం, మహనీయుల ఆశయాలను వారికి తెలియజెప్పడం వంటి కార్యక్రమాలు చేపట్టాలని నాగేష్ పిలుపునిచ్చారు. అదేవిధంగా మార్చ్ 15న ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో నిర్వహించబోయే భీమ్ దీక్ష ప్రారంభ సభకి పెద్ద ఎత్తున ప్రజలు తరలిరావాలని నాగేష్ విజ్ఞప్తి చేశారు. ఖమ్మం జిల్లాలో జరిగే భీమ్ దీక్ష కార్యక్రమానికి వచ్చే వారు తమ యొక్క వివరాలను తన వ్యక్తిగత వాట్సాప్ నెంబర్ 8985804252కు వివరాలను తెలియజేయాలని నాగేష్ సూచించారు. కార్యక్రమంలో స్వేరోనాయకులు బాల్‌జంగయ్య, కిషోర్, లింగం, రమేష్, నరేష్, విష్ణు, మహేందర్, పర్వతాలు, నరేష్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సైన్స్ ఫెయిర్

మహబూబ్‌నగర్, మార్చి 13 ప్రభాతవార్త: మహబూబ్‌నగర్ పట్టణంలోని ఆదిత్య స్కూల్‌లో గురువారం సైన్స్ ఫెయిర్ కార్యక్రమాన్ని జిల్లా ప్రైవేట్ స్కూల్ అధ్యక్షులు ఎన్. ప్రభాకర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన ప్రయోగాలను చూసిన ఆయన మాట్లాడుతూ మన దేశంలో సివి రామన్ కల్పనాచౌల రాకేష్ శర్మ రాజేష్ శర్మ అబ్దుల్ కలాం లాంటి ఎంతోమంది శాస్త్రవేత్తలు పుట్టిన ఈ భారత దేశంలో ప్రతి ఒక్కరూ వారిని ఆదర్శంగా తీసుకొని రాబోయే రోజుల్లో గొప్ప సైంటిస్టులుగా ఎదగాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సైన్స్ ఎగ్జిబిషన్ వారు చేసిన ప్రయోగాల గురించి విద్యార్థుల యొక్క తల్లిదండ్రులకు, తమ తోటి విద్యార్థి విద్యార్థులకు వారు చేసిన ప్రయోగాలను చక్కగా వివరించారు. విద్యార్థులు, సౌమ్య, వర్షిత్, భాను శ్రీకర్ హర్షవర్ధన్ కీర్తి ప్రియ, సింధు మొదలైన వారు ప్రయోగాలను చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రుక్మిణి. లక్ష్మి, జోష్ణ, భాగ్యలక్ష్మి, శైలజ, అనురాధ పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులందరం కలిసికట్టుగా ఉందాం

సమావేశంలో మాట్లాడుతున్న గౌడ సంఘం నాయకులు

పెబ్బేరు, మార్చి 13 ప్రభాతవార్త : పెబ్బేర్ మున్సిపాలిటీ పరిధిలో కిష్టారెడ్డిపేట చెలిమిల్ల కల్లుగీత కార్మిక సభ్యులు దాదాపు 108 మంది ఉన్నారు. వీరిలో 6 మంది టిఎఫ్టి లైసెన్స్‌దారులు మిగిలిన సభ్యులతో ఐక్యతగా ఉండకపోవడం వలన వారి మధ్య గత కొన్ని సంవత్సరాల నుంచి సమస్యలు ఏర్పడ్డాయి. ఈ విషయమై ఇటు అధికారులకు, ప్రజా ప్రతినిధులతో చర్చించినప్పటికీ ఫలితం లేకపోవడంతో కల్లు అమ్మకాలు మూడు సంవత్సరాలుగా నిలిచిపోయాయి. ప్రజా సమస్యలపై పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగేందర్ గౌడ్ మంగళవారం రోజు నిర్వహించిన మార్నింగ్ వాక్ లో భాగంగా గౌడ సభ్యులు ఈ సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్లగా వారు కులస్తులందరూ ఐక్యమత్యంతో ఉండి కల్లు అమ్మకాలు కొనసాగించుకోవాలని, మన గౌడ కులస్తులకు ఈ వృత్తి ఆధారం. అందువల్ల సభ్యులందరూ ఏకమై ఐక్యతతో కల్లుమాములను కొనసాగించాలని వారు కోరారు. కానీ కొంతమంది లైసెన్సు దారులు రాచల యుగేందర్‌గౌడ్‌పై అసత్య ఆరోపణలు చేస్తూ వారి పరువుకు నష్టం వాటిల్లే విధంగా మాట్లాడడంతో గురువారం రోజు 80 మంది సభ్యుల పక్షాన గౌడ నాయకులు పెబ్బేరు ప్రెస్ క్లబ్ నందు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అందరం కలిసికట్టుగా చేసుకుందామని ఏకతాటిపై ఉండి ప్రభుత్వం నిర్ణయించిన స్థలాల్లో బౌండరీలు వేసుకొని కల్లు అమ్మకాలు చేసుకుందామని దీనికి అందరుకలిసి రావాలని టీఎఫ్టి లైసెన్స్ దారులను గౌడ సంఘం నాయకులు కోరారు. అనవసరంగా లేనిపోని అపోహాలు సృష్టించి ఇతరులపై ఆరోపణలు చేస్తూ గొడవల్లోకి లాగ వద్దని ఏదైనా ఉంటే కూర్చొని మాట్లాడుకుందామని వారు తెలియజేశారు. కార్యక్రమంలో గౌడ నాయకులు రమేష్‌గౌడ్, సత్యన్న గౌడ్, రాజు గౌడ్, అల్వాల కృష్ణయ్య గౌడ్, మధుసూదన్ గౌడ్, రామన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో ప్రొఫెసర్ డాక్టర్ పి.సర్వేశ్వర్‌రెడ్డి మృతి

గద్వాల, మార్చి 13 ప్రభాతవార్త: ప్రొఫెసర్ డాక్టర్ పి.సర్వేశ్వర్ రెడ్డి అనారోగ్యంతో గురువారం రోజు హైదరాబాదులో మృతి చెందారు. ప్రొఫెసర్ డాక్టర్ పి.సర్వేశ్వర్ రెడ్డి, నీలోఫర్ హాస్పిటల్, ఉస్మానియా మెడికల్ కాలేజ్ హైదరాబాద్ నందు పనిచేస్తున్న ఈయన కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం రోజు మృతి చెందినట్లు గార్లపాడు కృష్ణారెడ్డి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తెలిపారు. ప్రొఫెసర్ డాక్టర్ పి.సర్వేశ్వర్ రెడ్డి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా ఉన్నప్పుడు ఈయన వైద్య సేవలు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగినట్లు, గద్వాల మాజీ ఎమ్మెల్యే పాగ పుల్లారెడ్డి అల్లుడు ఆయన పి.సర్వేశ్వర్ రెడ్డి హైదరాబాద్ ఉస్మానియా మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్గా కొనసాగుతూ అనారోగ్యంతో గురువారం రోజు మృతి చెందినట్లు అంత్యక్రియలు శుక్రవారం రోజు ధరూర్ మండలం గార్లపాడు గ్రామంలో జరగనున్నట్లు వారు తెలిపారు. ప్రొఫెసర్ పి.సర్వేశ్వర్ రెడ్డికిభార్య డాక్టర్, కూతురు డాక్టర్, కుమారుడు ఇంజనీరింగ్ గుర్తులలో కొనసాగుతున్నట్లు వారు తెలిపారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, మాజీ మంత్రి డీకే సమర సింహ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డీకే భరతసింహా రెడ్డి, మాజీ జడ్పి చైర్మన్ లు బందారి భాస్కర్, సరిత తిరుపతయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ కేశవ్, మార్కెట్ చైర్మన్ చైర్మన్ హన్మంత్, మాజీ మార్కెట్ చైర్మన్ లు గడ్డం కృష్ణ రెడ్డి, శ్రీధర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు బండ్ల చంద్ర శేఖర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి లు సంతాపం పలికారు.

ప్రాథమిక వ్యవసాయ సహకార బ్యాంకు సేవలను మరింత విస్తరించాలి

● ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి

ఉప్పునుంతల ప్రాథమిక సహకార సంఘం లావాదేవీలు పరిశీలిస్తున్న డిసిసిబి చైర్మన్

ఉప్పునుంతల, మార్చి13 ప్రభాతవార్త: జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపూ సంఘాల సేవలను మరింత విస్తరింప చేయాలని ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయపరపతి సంఘం సహకార బ్యాంకును ఆయన సందర్శించారు. ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం లావాదేవీలను కార్యకలాపాలను ఆయన పరిశీలించారు. రాష్ట్రంలోనే ఉత్తమసేవలందిస్తున్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార బ్యాంకుగా ఉప్పునుంతల సింగిల్ విండోకు మంచి గుర్తింపు రావడం హర్షనీయమన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సహకార శాఖ కమిషనర్ సహకార బ్యాంకును సందర్శించి సంతృప్తిని వ్యక్తం చేయడం నిదర్శనమని పేర్కొన్నారు. రుణాల మంజూరు రికవరీ చేయడంలో జిల్లాలోని నెంబర్ వన్ స్థానంలో ఉందని ఆయన వెల్లడించారు. జిల్లా, రాష్ట్రస్థాయిలో మిగులు బడ్జెట్ కలిగిన బ్యాంకుగా గుర్తింపు పొందడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి ముఖ్య కార్యనిర్వాహణాధికారి పురుషోత్తం రావు, ఏజిఎం భూపాల్ రెడ్డి, ఉప్పునుంతల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు చైర్మన్, డిసిసిబి డైరెక్టర్ సత్తు భూపాల్‌రావు, సహకార సంఘం బ్యాంకు సీఈఓ కొత్త రవీందర్ రావు, అచ్చంపేట, కొండనాగుల, అంబట్‌పల్లి అధ్యక్షులు రాజిరెడ్డి, జబ్బునర్స య్యయాదవ్, జె.హన్మంత్ రెడ్డి, డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ బి.రవి కుమార్, బ్రాంచ్ సంఘ సిబ్బంది మల్లయ్య, శంకర్, శేఖర్‌రెడ్డి, రజిత, శోభ, వెంకటరమణ, కాశన్న, రాములు, చున్ను పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు ఉత్పత్తి చేస్తే కఠిన శిక్షలు

■ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ వి.రజిని

సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ న్యాయమూర్తి వి.రజిని

పెబ్బేరు, మార్చి 13 ప్రభాతవార్త: నకిలీ విత్తనాలు ఉత్పత్తి చేసిన వారికి కఠిన శిక్షలు విధించబడతాయని జిల్లా న్యాయ సేవధికార సంస్థ కార్యదర్శి సీనియర్ న్యాయమూర్తి వి.రజని అన్నారు. గురువారం పెబ్బేరు మండలంలోని జానంపల్లి గ్రామంలో ఉన్న రైతువేదికలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో రైతులకు రైతు చట్టాలు రైతు సంక్షేమ పథకాలపై న్యాయ అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యి మాట్లాడారు. ప్రతి ఒక్క రైతు కూడా రైతు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అదేవిధంగా నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించడమే లక్ష్యంగా విత్తన చట్టం 1966 రూపొందించబడిందని తెలియజేశారు. అదేవిధంగా వ్యవసాయ ఉత్పత్తులను రైతులకు ఎంఆర్‌పి ధర కంటే ఎక్కువ అమ్మిననకిలీ ఉత్పత్తులను అందించిన కన్స్యూమర్ కోర్టులో ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న అగ్రికల్చర్ ఆఫీసర్ మాట్లాడుతూ రైతులకు అన్ని రకాల సదుపాయాలను అందించడానికి ఎల్లవేళలా కృషి చేస్తామని తెలిపారు. పెబ్బేరు మండలం తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ రవీందర్ నాయక్ మాట్లాడుతూ వ్యవసాయ రుణాలు పొందడానికి అవసరమైన అర్హతలు పత్రాల గురించి రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్‌ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్‌ఉత్తరయ్య, అగ్రికల్చర్ డైరెక్టర్ శివ నాగిరెడ్డి, అగ్రికల్చర్ ఆఫీసర్ షేక్ మున్న, టి జి బి బ్యాంక్ మేనేజర్ రవీందర్ నాయక్, ఏ.ఈ.ఓలు జయశ్రీ ,ఆంజనేయులు, ప్రశాంత్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంజూరైన అభివృద్ధి పనులను చేపట్టాలి

సమావేశంలో మాట్లాడుతున్న బైరాపూర్ మాజీ సర్పంచ్ దార్ల కుమార్

వెల్దండ, మార్చి 13 ప్రభాతవార్త: గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోని ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మంజూరు చేయించిన అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు బైరాపూర్ మాజీ సర్పంచ్ దార్ల కుమార్ పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గురువారం మాజీ సర్పంచ్ దార్ల కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రజలకు చేరువయ్యారని, కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టి 15 నెలలు గడుస్తున్న రాష్ట్రంలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నాడని బిఆర్ఎస్ ప్రభుత్వం ఆయాంలో బైరాపూర్ వాగు ఉధృతంగా పొంగిలో లెవెల్ వంతెన కొట్టుకపోవడంతో అప్పటి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అధికారులతో మాట్లాడి రూ.9కోట్లతో వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపిస్తే రూ.2 కోట్ల పైబడి నిధులు మంజూరు అయ్యాయని, వంతెన, బీటిరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి టెండర్లు పిలవడం జరిగిందని, ఆ టెండర్లు కాంట్రాక్టర్ టెండర్‌ను దక్కించుకున్నారని, అప్పుడు వర్షాలు ఎక్కువ పడడంతో వరద నీరు ఉధృతంగా వచ్చాయి. దీంతో పనులలో కొద్దిగ జాప్యం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పడి నేటికీ నెలలు గడుస్తున్న వంతెన పనులు ముందుకుసాగడం లేదని విమర్శించారు. అదే విధంగా రాష్ట్రంలో ప్రజా పాలనలో అనేక అన్ని వర్గాల ప్రజలకు తీవ్రఅన్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, లింగం ముదిరాజ్, జంగిలి ఆనంద్, మధుసూదన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులు

చిన్న చింతకుంట, మార్చి13 ప్రభాతవార్త: విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠశాల గదుల్లో చక్కటి బోధన చేశారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో గురువారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. బండర్‌పల్లి, ఉంద్యాల ప్రభుత్వ పాఠశాలతో పాటు మండల కేంద్రంలో సందీప ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. బండర్ పల్లిలోని మండల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరిస్తూ తోటి విద్యార్థులకుపాఠ్యాంశాలను చక్కగా బోధించారు. పాఠ్యాంశాలను బోధించిన విద్యార్థులను మండల విద్యాధికారి మురళీ కృష్ణ అభినందించారు. సాందీప ప్రాథమిక ఉన్నత పాఠశాలలో స్వపరిపాలన దినోత్సవం సందర్భంగా డీఈవోగా ఫయాజ్, ఎంఈఓగా హర్షవర్ధన్, ప్రిన్సిపల్‌గా గౌతమ్, ఉపాధ్యాయులుగా 32 మంది వ్యవహరించారు. వీరికి కరస్పాండెంట్ కాంతయ్య, ప్రిన్సిపల్ కృష్ణయ్యలు బహుమతులను అందజేసి విద్యార్థులను అభినందించారు. ఆయా కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలతోపాటు ఉపాధ్యాయ బృందం, సిఆర్పి విజయ్ సింహ ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

నవాబుపేట, మార్చి 13 ప్రభాతవార్త: మండల పరిధిలోని చెన్నారెడ్డిపల్లి పాఠశాలలోగురువారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. స్వయం పరిపాలనలో భాగంగా విద్యార్థులు కలెక్టర్‌గా బడుగుల వైష్ణవి ఎంఈఓగా బి. బాలేశ్వరి హెచ్ఎంగా వాళ్ళ జస్వంత్ మొత్తం 24 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వారి విధులు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కాంప్లెక్స్ హెచ్ఎం దశరథ్ పాల్గొని మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్నవారి సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపకరిస్తాయని తెలియజేశారు. విద్యార్థులను జ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర వెలకట్టలేనిది అన్నారు. విద్యార్థి దశ నుండే కృషి పట్టుదల క్రమశిక్షణ ఉంటే చిన్ననాటి నుండి లక్ష్యాలను పెట్టుకొని వాటినీ సాధించుకునే లక్ష్యంతో ముందడుగు వేస్తుంటే జీవితంలో అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని ఈ సందర్భంగా తెలియజేశారు. విద్యార్థులంతా చక్కగా చదివిపదవ తరగతిలో 10జిపిఏ సాధించాలని జీవితంలో అత్యున్నత స్థాయి ఉద్యోగాలలో స్థిరపడాలని కోరారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయులు బి. శ్రీనివాస్, శ్యాంసుందర్ రెడ్డి, గోపాల్‌గౌడ్, రాములు, మల్లేష్, గ్రామస్తులు విద్యార్థులు పాల్గొన్నారు.

భీమ్ ధీక్ష ద్వారా చీకటి రుగ్మతలను చీల్చివేద్దాం

వెల్దండ, మార్చి 13 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే పవిత్ర భీమ్ దీక్షను విజయవంతం చేద్దామని వెల్దండ స్వేరోస్ నాయకులు పేర్కొన్నారు. గురువారం భీమ్ దీక్ష వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సీనియర్ స్వేరొ దుబ్బ నాగేష్, జంగిలీ నిరంజన్, కాటిక రామస్వామిలు మాట్లాడుతూ స్వేరోస్ నెట్వర్క్‌లోని అతి పెద్ద పండుగ అక్షరం, ఆర్థికం, ఆరోగ్యంపైన జ్ఞానం పెంపొందించుట కొరకు చీకటి రుగ్మతలను చీల్చుకొని జ్ఞానమనే అక్షర దీపాన్ని ప్రపంచానికి పరిచయం చేసి ఈ స్వేరోస్ నెట్వర్క్ ఆధ్వర్యంలో ఈ పవిత్ర మాసంలో నేలకొండపల్లిలో నిర్వహించే భీమ్ దీక్ష ప్రారంభ మార్చ్ 15 నుండి ఏప్రిల్ 14న ముగింపు సభ తలకొండపల్లిలో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి మండలంలోని స్వేరో నాయకులు యువకులు విద్యార్థి నాయకులు విద్యావేత్తలు పెద్ద ఎత్తున తరలి విజయవంతం చేయాలని వారు పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పుల్లయ్య, మాజీ జెడ్పిటిసి జంగయ్య, నాయకుడు జగదీష్, యాదగిరి, అశోక్, శీను, శశి, డాక్టర్ రాజు, తిరుపతి తదితరులు ఉన్నారు.

మామిళ్ళపల్లిలో వైద్య శిబిరం

ఉప్పునుంతల, మార్చి13 ప్రభాతవార్త: మండలంలోని మాయలపల్లి గ్రామంలో జరుగుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గురువారం మామిళ్ళపల్లి గ్రామంలో వైద్య శిబిరాన్ని మెడికల్ ఆఫీసర్ స్వప్న ఆధ్వర్యంలో ఘనంగా వైద్య శిబిరం నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు సౌకర్యార్థము దేవస్థాన కమిటీ చైర్మన్ వేముల నర్సింహారావు సూచనల మేరకు వైద్య సేవలను అందించుటకు శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వైద్య అధికారిణి డా.స్వప్న తెలిపారు ఎండలు మండుతున్నందునతగిన జాగ్రత్తలు తీసు కోవాలని ఆమె సూచించారు. భక్తులు ఎవరైనా అనారోగ్యానికి గురైతే తక్షణమే వైద్య శిబిరంలోతగిన చికిత్స పొందాలని ఆమె కోరారు. ఈ వైద్య శిబిరం ఈనెల11నుంచి 16వ తేదీ వరకు కొనసాగుతుందని ఆమె పేర్కొన్నారు. వైద్య శిబిరంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనయ్య ఏఎన్ఎం సరిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన గుడ్డు ధర పెంపు

ఉప్పునుంతల, మార్చి 13 ప్రభాతవార్త: బడి పిల్లలకు పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకం లో వడ్డిస్తున్న గుడ్డు ధరను పెంపుదల చేసినట్లు ఉన్నతాధికారులు ఉత్తర్వులను జారీ చేశారు. మెనూ ప్రకారం ప్రతి సోమ బుధ ,శుక్రవారం మధ్యాహ్న భోజనంలో గుడ్డును వడ్డించాల్సింది. వారంలో మూడుసార్లు అదనపు ధర చెల్లించి గుడ్లను వడ్డించడం భారంగా మారిందని వంట ఏజెన్సీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనంలో వడ్డిస్తున్న గుడ్డుకు ప్రభుత్వం రూ.5 చెల్లించేది. వంట ఏజెన్సీల, విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించిన ప్రభుత్వం గుడ్డుకు చెల్లించే ధరను రూ.5 నుంచి రూ. 6కు వంట ఏజెన్సీలకు చెల్లించే విధంగా ఆదేశాలను జారీ చేశారు. మార్చి నుంచి పెరిగిన గుడ్డు ధర అమల్లోకి వస్తున్నట్లు వెల్లడించారు. మార్కెట్లో గుడ్డు ధర రూ.5 పైబడి ఉండడంతో వంట ఏజెన్సీలకు ఇబ్బందికరంగా ఉండేది. గుడ్డు ధరను ఆరు రూపాయలకు పెంచడంతో వంట ఏజెన్సీలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

క్రీడాకారులకు ఘన సన్మానం

విజయవంతమైన జిల్లాస్థాయి టెన్నికాయిట్ పోటీలు

మక్తల్, మార్చి 13 ప్రభాతవార్త: మక్తల్ పట్టణంలోని సాయిజ్యోతి ఉన్నత పాఠశాల వద్ద గురువారం నిర్వహించిన జిల్లా స్థాయి టెన్నికాయిట్ పోటీలు విజయవంతమయ్యాయి. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుండి దాదాపు 100 మంది బాల బాలికలు ఈ పోటీలలో పాల్గొనగా, ప్రతిభ కనబరిచిన అఖిల, గాయత్రి, స్వప్న, శ్రీలత, పల్లవి, స్వప్న, ఆకాష్, అరవింద్, అశోక్, అఖిల్‌లను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చ

పేట,కొడంగల్ ఎత్తిపోతల పథకం భూసేకరణను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలోని మక్తల్, నారాయణ పేట నియోజక వర్గాల పరిధిలో మొత్తం 21 గ్రామాలలో 556 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉందని,ఇప్పటి వరకు 16గ్రామాలలో భూసేకరణ గాను ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని తెలిపారు. అయితే ఆ16గ్రామాలకు సంబంధించి మొత్తం 379.07ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందన్నారు. మిగతా 5గ్రామాలలో భూసేకరణ ప్రాసెస్‌లో ఉందని ఆర్డీవో రాంచందర్ నాయక్ తెలిపారు. అంతకుముందు కోస్గి రోడ్డు విస్తరణ పనులు ఎంతవరకు వచ్చాయని జిల్లా కలెక్టర్ ప్రశ్నించగా కోస్గి పట్టణంలో మొత్తం 228 వ్యాపార, నివాస గృహాలు విస్తరణ లో పోతున్నాయని, వాటిలో 139 సొంత స్థలాలు, 89 ఖాళీ స్థలాలు ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ నాగరాజు తెలిపారు. వీరిలో కొంతమంది కోర్టును ఆశ్రయించారని చెప్పారు.ఈ విషయమై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కోస్గి రోడ్డు విస్తరణ పనులను ఎలాంటి వివాదాలు లేకుండా అర్హతను బట్టి నష్ట పరిహారం చెల్లించి ముందుకు వెళ్లాలని అవసరమైతే న్యాయ నిపుణుల సలహాలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ గరిమా నరుల,ఆర్డీవో రామచందర్ నాయక్, ఆర్ అండ్ బి డీఈ రాములు, పిఆర్ ఈ ఈ హీర్యా నాయక్, ఇరిగేషన్ ఈ ఈలు ఉదయ్ శంకర్, బ్రహ్మానందం, డిఈఈలు సతీష్, సురేష్, కోస్గి తహసిల్దార్ బక్క శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, భూసేకరణ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

వడదెబ్బ సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

◆ నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట టౌన్, మార్చి13 ప్రభాతవార్త: రానున్న తీవ్ర ఎండాకాలంలో వడదెబ్బ సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. గురువారం నారాయణపేట జిల్లా కలెక్టర్ విసి హాల్లో వాతావరణం మార్పులు వేసవికాలం ఎండ తీవ్రత వడదెబ్బ తదితర అంశాలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఎండాకాలంలో ప్రతి ఒక్కరు ప్రయాణాలలో త్రాగునీరు వెంట తీసుకెళ్లాలన్నారు. ఎండ తగలకుండా తగు జాగ్రత్త తీసుకోవాలన్నారు. వీలైనంత వరకు ఇంట్లోనే ఉండాలని ఐఎండి సూచనలు పాటించాలన్నారు. ముఖ్యంగా చిన్నారులు మహిళలు వృద్ధులు గర్భిణీలు ఎండ పట్ల తగు జాగ్రత్తవహించాలన్నారు. ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్ ఉపయోగించాలని నిమ్మరసం మజ్జిగ పండ్ల రసాలు వంటి ఇంట్లో తయారు చేసిన పానీయాలు కొద్దిగా ఉప్పు కలిపి త్రాగాలన్నారు. పుచ్చకాయ, కర్బూజా, ఆరెంజ్, ద్రాక్ష, పైనాపిల్, దోసకాయ, పాలకూర లేదా ఇతర స్థానికంగా లభించే పండ్లు కూరగాయలు వంటి అధిక నీటి పరిమాణం గల సీజనల్ పండ్లు కూరగాయలు తినాలన్నారు. సన్నని వదులుగా లేత రంగులో ఉండే కాటన్ వస్త్రాలను ధరించాలని తలను కప్పుకోవాలని సూర్య రష్మి తగలకుండా గొడుగు టోపీ టవల్ వాడాలన్నారు. అనారోగ్యంగా భావిస్తే విపరీతమైన వేడి సమయంలో చల్లని ప్రదేశానికి వెళ్లి ద్రవపదార్థాలు తాగాలి. వడదెబ్బ అనేది మెడికల్ ఎమర్జెన్సీ కావున అయోమయం గందరగోళం ఆందోళన చిరాకు మూర్ఛ లేదా కోమ వంటివి పెద్దలలో కలుగుతాయని, శరీర ఉష్ణోగ్రత 104 డిగ్రీల వరకు ఉండి తలనొప్పి ఆందోళన, వికారం, వాంతులు, హృదయ స్పందన పెరగడం వంటివి కలుగుతాయన్నారు. కూలీలు పని ప్రదేశంలో చల్లని త్రాగునీటిని ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్మికులు నేరుగా సూర్య రష్మికి గురికాకుండా జాగ్రత్త వహించాలన్నారు. కార్మికులకు కూలీలకు షెడ్డు ఏరియాలో ఏర్పాటు చేయాలన్నారు. మీ ఇంటిని చల్లగా ఉంచండి షెటర్లు లేదా చలువ పందిల్ల ను ఉపయోగించండి. రాత్రివేళ కిటికీలను తెరవాలి. పగటిపూట దిగువ అంతస్తులలో ఉండడానికి ప్రయత్నించాలని శరీరాన్ని చల్లబరచటానికి ఫ్యాన్, తడి బట్టలను ఉపయోగించాలన్నారు. ముఖ్యంగా మధ్యాహ్నం 12 నుండి మూడు గంటల వరకు ఎండలో బయటకు రాకూడదనీ ఇలాంటి జాగ్రత్తలు వేసవిలో తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.అనంతరం దీనికి సంబంధించిన గోడపత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ట్రైని కలెక్టర్ గారిమా నరుల, డిఎంహెచ్ఓ సౌభాగ్య లక్ష్మి తదితర శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా మొల్లమాంబ జయంతి

మహబూబ్‌నగర్, మార్చి13 ప్రభాతవార్త: 16వ శతాబ్దపు తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్ల మాంబ జయంతి సందర్భంగా బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా కార్యాలయంలో బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఎం శ్రీనివాస్‌సాగర్ ఇతర కుల సంఘ పెద్దలు కలిసి ఆమె చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. సామాన్య కుటుంబంలో జన్మించి తెలుగులో మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిన రామాయణాన్ని రాసింది. అదే విధంగా రామాయణాన్ని అతి సులువుగా అందరికి అర్థమయ్యే విధంగా తెలుగులో రచించి కీర్తి గడించిందన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సారంగి లక్ష్మికాంత్, నాయి బ్రాహ్మణ సంఘ పట్టణ అధ్యక్షుడు అశ్విని సత్యం, బీసీ సమాజ్ మహబూబ్ నగర్ నియోజకవర్గ కన్వీనర్ దుర్గేష్, బీసీ సమాజ్ దేవరకద్ర నియోజకవర్గ కన్వీనర్ బి.శేఖర్, బీసీసమాజ్ మహబూబ్‌నగర్ పట్టణ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, బీసీసమాజ్ సభ్యులు శంకర్‌నాయి, శ్రీనివాస్ నాయి పాల్గొన్నారు.

ఉప్పునుంతల, మార్చి 13 ప్రభాతవార్త: శ్రీ శ్రీ శ్రీ తెలుగు తొలి కవయిత్రి మొల్ల మాంబ 585 వ జయంతి వేడుకలు శుక్రవారం శాలి వాహన సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల పోచమ్మ చౌరస్తాలో శుక్రవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

హోలీ పండుగను సంప్రదాయ పద్ధతుల్లో జరుపుకోవాలి

◆ వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి క్రైమ్, మార్చి13 ప్రభాతవార్త: జిల్లా ప్రజలు హోలీ పండగను సంప్రదాయ పద్ధతుల్లో ప్రకృతిలో లభించే, చర్మానికి, పర్యావరణానికి హాని కలిగించని న్యాచురల్ కలర్స్‌ను వినియోగించి, ప్రశాంత వాతావరణంలో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇష్టపడని వ్యక్తులు, ప్రదేశాలు వాహనాలపై రంగులు లేదా రంగు నీటిని విసరడం కఠినంగా నిషేధించబడింది జిల్లా ప్రజలు, యువత మద్యం సేవించి వాహనాలను నడపడం,బహిరంగ ప్రదేశాలపై, ఇష్టం లేని వ్యక్తులపై, వాహనాలపై రంగులు, రంగు నీళ్లుచల్లడం వంటివి చేయకూడదు అన్నారు. బైకులపై, కార్లల్లో గుంపులుగా తిరిగి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అట్టి వ్యక్తులపై చట్టరిత్య చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. హోలీ పండుగ అనంతరం చెరువుల్లో లోతట్టు ప్రాంతాల్లో స్నానాలు ఆచరించే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని ఆయన అన్నారు.ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల కార్యకలాపాలను తరుచూ గమనిస్తూ వారికి సరైన మార్గాలను నిర్దేశించాలన్నారు. యువత వాహనాలు నడిపే క్రమంలో అతివేగం, ర్యాష్ డ్రైవింగ్, ట్రిపుల్ డ్రైవింగ్, లాంటివి మానుకోవాలని సూచించారు. హోలీ పండగ సందర్భంగ హోలీ రోజు ఉదయం 6గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు హోలీ పండుగ జరుపుకోవాలనిఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా సున్నిత ప్రదేశాలలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ వివరించారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో 100 డయల్ చేయాలని సూచించారు. ఈ హోలీ మీ జీవితాలలో రంగులు నింపాలని కోరుకుంటూ వనపర్తి జిల్లా ప్రజలకు,పోలీసు అధికారులకు,సిబ్బందికి జిల్లాఎస్పీ హోలీ పండగ శుభాకాంశాలు తెలియజేశారు.

అంబులెన్స్ సేవలపై తనిఖీ

చిన్నంబావి, మార్చి13 ప్రభాతవార్త: చిన్నంబావి మండల కేంద్రంలోని ఇటీవల నూతనంగా మంజూరైన 108 అంబులెన్స్‌ను ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ రవికుమార్ వనపర్తి జిల్లా మేనేజర్ రత్నంలు ఆకస్మిక తనిఖీ చేశారు.అంబులెన్స్‌లోని పరికరాల పనితీరును మరియు రికార్డులను పరిశీలించడం జరిగింది.చిన్నంబావి మండల ప్రజలు ఎటువంటి అత్యవసర పరిస్థితి వచ్చిన 108 కాల్ చేసి ఈ సేవలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మెడికల్ టెక్నీషియన్ శ్రీధర్, పైలెట్ రవి పాల్గొనడం జరిగింది.

మాజీ మంత్రి జగదీశ్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు అప్రజాస్వామికం

◆ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసనలో అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఇటిక్యాల,మార్చి 13 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ఎలాంటి కారణాలు లేకుండా మాజీ మంత్రి ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డిపై ఈ అసెంబ్లీ సమావేశాల వరకు అధికార కాంగ్రెస్ ప్రభుత్వంసస్పెన్షన్ వేటు వేయడంఅప్రజాస్వామికమని అల్లంపూర్ ఎమ్మెల్యే విజయుడు మండపడ్డారు.ఆయన సస్పెన్షన్‌ను నిరసిస్తూ మాజీమంత్రులు కేటీఆర్,హరీష్‌రావు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అసెంబ్లీ నుండి బయటకు వచ్చి అంబేద్కర్ ముందు నిరసనకు దిగారు. ఈ నిరసనలో అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) విద్య

మొదటి పేజీ తరువాయి భాగం..

విద్యార్థుల్లో మెరుగైన సామర్థ్యాల కోసం చర్యలు తీసుకుంటున్నాం. జిల్లాలో 13 పాఠశాలలను ఎంపిక చేయగా, ఆయా తరగతుల్లో వెనుకబడిన సీ.గ్రేడ్ విద్యార్థులను గుర్తించి, ఆ విద్యార్థులకు ఈకేస్టెప్ అనే కంపెనీ సహకారంతో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఏఐ బోధన అందిస్తాం. ఇందుకోసం ఆ పాఠశాలల్లో లేదా పక్కన ఉన్న ఉన్నత పాఠశాలల్లోని కంప్యూటర్లను ఉపయోగించి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యను అందించి, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఆంగ్ల, గణిత సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో ఎంపిక చేసిన 13 పాఠశాలల్లో పైలెట్ ప్రాజెక్టు ద్వారా విద్యార్థులకు ఆర్టిఫిషల్ ఇంటలిజెన్స్ ఏఐ విద్యా బోధన అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం అన్ని జిల్లా విద్యాశాఖ అధికారి నాగర్ కర్నూల్ ఏ రమేష్ కుమార్ తెలిపారు.

విద్యార్థులకు ప్యాడ్, పెన్నుల అందజేత

చిన్నంబావి, మార్చి 13 ప్రభాతవార్త: మండల కేంద్రంలో కేజీబీవీ పాఠశాలలో పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థినిలకు ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్ను, పెన్సిల్, స్కేల్, ఎరేజర్ వంటి ఎక్సామ్ కిట్టు ను జుర్రు పరశురాములు సొంత డబ్బులతో అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేజీబీవీలోని పదవ తరగతి విద్యార్థినిలు ఎవరైనా ఈ పబ్లిక్ పరీక్షలో 10/10 లేదా 9.9 మార్క్స్ పర్సంటేజ్ సాధించిన ఎవరికైనా ఎంతమందికైనా మూడు వేల రూపాయలను బహుమతిగా అందిస్తానని ఈ సందర్భంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ చిన్నంబావి మండల యూత్ అధ్యక్షుడు గంగారి శ్రీనివాసులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ జగదీష్, శంకర్, బొల్లు శీను, రమేష్, శ్రీమంతుడు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ అప్లికేషన్లను త్వరితగతిన పరిష్కారం చేయాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

వనపర్తి టౌన్ మార్చి 13 ప్రభాతవార్త: ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం పెండింగ్‌లో ఉన్న ఫారం 6, 7, 8 అప్లికేషన్లను త్వరితగతిన పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం తెలంగాణ ఎన్నికల సీఈఓ సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యంలతో కలిసి హాజరయ్యారు. సీఈఓ మాట్లాడుతూ మార్చి 19 లోపు ఈఆర్వో స్థాయిలోరాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం పూర్తి చేయాలని చెప్పారు. మార్చి22 లోపు జిల్లా ఎన్నికల అధికారి స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫారం 6,7, 8 అప్లికేషన్లను మార్చి 21 లోపు పరిష్కరించాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో వారి నుంచి వచ్చే అభ్యంతరాలను స్వీకరించి పరిష్కారం చేయాలని సూచించారు. సమావేశంలో తహసిల్దార్ కిషన్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులను నిర్మూలించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్

వనపర్తి టౌన్, మార్చి13 ప్రభాతవార్త: జిల్లాలో సంక్రమిత, అసంక్రమిత వ్యాధులను నిర్మూలించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్య అధికారులను ఆదేశించారు. క్షయ వ్యాధి,మధుమేహం, వేసవి కాలంలో వచ్చే వడదెబ్బలను అరికట్టేందుకు వైద్య శాఖ ద్వారా చేపడుతున్న చర్యల పై గురువారం కలెక్టర్ ఛాంబర్ లో సమీక్ష నిర్వహించారు. మిషన్ మధుమేహ ద్వారా జిల్లాలోని 40 సంవత్సరాల వయస్సు పైబడిన వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి మధు మేహం వ్యాధిని ముందుగానే గుర్తించి వ్యాధి నివారణకు అవగాహన,మందులు ఇవ్వడం జరుగుతుంది. జిల్లాలో 40 సంవత్సరాల వయస్సు పైబడిన ప్రతి ఒక్కరికీ నిర్వహిస్తున్న వైద్య పరీక్షలు ఇప్పటి వరకు దాదాపు 70శాతం పూర్తి అయ్యిందని మిగిలినవి మార్చి 25 లోపు పూర్తి చేయాలని వైద్య అధికారులను ఆదేశించారు. జిల్లాలో మధుమేహం బారిన పడకుండా ఉండటానికి, వచ్చినవారు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహారపు అలవాట్లలో మార్పులు, వ్యాయామం పై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించడమే కాకుండా గోడపత్రికలు చేయించి ప్రచారం చేయాలని ఆదేశించారు.జిల్లాలోని అనుమానిత లక్షణాలు ఉన్న క్షయవ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహించే ప్రక్రియ వందశాతం పూర్తి చేయాలని ఏ ఒక్క అనుమానితున్ని వదిలిపెట్టవద్దని కలక్టర్ ఆదేశించారు. దాదాపు 99 శాతం ప్రక్రియ పూర్తి అయ్యిందని మిగిలిన ఒక్క శాతం సైతం త్వరలోపూర్తి చేస్తామని ప్రోగ్రాం ఆఫీసర్ డా. సాయినాథ్ రెడ్డి తెలిపారు. క్షయవ్యాధి నిర్ధారణకు గల్లా పరీక్షతో పాటు ఎక్సరే తీసి క్షయవ్యాధి నిర్ధారణ పకడ్బందీగా చేయాలని సూచించారు. వేసవి కాలంలో వడదెబ్బ బారిన పడకుండా అవగాహనతో పాటు అవసరమైన మందులు అన్ని ప్రాథమిక కేంద్రాల్లో సిద్ధంగా ఉంచుకోవాలనికలక్టర్ ఆదేశించారు.ముఖ్యంగా ఉపాధిహామీలో పనిచేసే వారికి ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు ముందు గానే అందుబాటులో ఉంచాలని సూచించారు. ఎవరైనా వడదెబ్బకు గురి అయితే సెలైన్,అవసరమైన మందులు ఇచ్చి పూర్తిస్థాయి వైద్యం అందిం చే విధంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వడదెబ్బ బారిన పడకుండాతగినసలహాలు సూచనలు ప్రచారం చేయాలని సూచించారు. జిల్లావైద్య అధికారి డా.శ్రీనివాస్, ప్రోగ్రాంఆఫీసర్లు డా. సాయినాథ్‌రెడ్డి, డా.రామచంద్ర రావు. డా. పరిమళ, బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

సాగు నీటి సరఫరా సక్రమంగా జరుగాలి

◆ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న కలెక్టర్

గద్వాల, మార్చి 13 ప్రభాతవార్త: సాగునీటి సరఫరా సమర్థవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కేటీ దొడ్డి మండలం కొండాపురం గ్రామంలో నీటి కొరతతో ఎండిపోతున్న పంటలను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. పొలాల్లో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించారు. వరి పంటలు నీటి కొరత కారణంగా తీవ్రంగా ప్రభావితమవుతున్నట్లు గుర్తించారు. ర్యాలంపాడు ఎడమ ప్రధాన కాలువ 104 ప్యాకేజీ పరిధిలోని కొండాపురం, గువ్వలదిన్నె, మైలగడ్డ గ్రామాల వద్ద కాలువ ప్రవాహాన్ని, నీటి సరఫరా పరిస్థితిని పరిశీలించారు. కాలువలో నీటి విడుదల, పంపిణీ విధానం, ఆయకట్టు పరిధిలోని ప్రాంతాలకు నీరు చేరుతున్న తీరును తెలుసుకునేందుకు అక్కడి పంపింగ్ స్టేషన్లు, పంపిణీ వ్యవస్థను పరిశీలించారు.అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడి రైతుల అభ్యర్థన మేరకు తక్షణమేసాగునీటిని కాలువల్లోకి విడుదల చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కాలువల ద్వారా సరఫరా అవుతున్న నీరు ఆయకట్టు చివరి ప్రాంతాలకు కూడా అందేలా సమతుల్యతను పాటించాలనీ సూచించారు. కాలువల ద్వారా నీరు ఆయకట్టు చివరి ప్రాంతాలకు చేరకుండా ఎగువ ప్రాంతాల్లోని రైతులు మోటార్లు, పంప్ సెట్లు ఉపయోగించి నీటిని వినియోగిస్తున్న పరిస్థితిని కలెక్టర్ పరిశీలించారు.ఇలా కాకుండా కాలువల వెంట నీటి వినియోగాన్ని సమతుల్యంగా నిర్వహించే విధంగా చూడాలన్నారు. నీటి ప్రవాహం చివరి ఆయకట్టు వరకు చేరే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ మద్దతుగా ఉంటుందని, వారి పంటలను కాపాడేందుకు అన్ని అవసరమైన చర్యలు తీసుకుంటామనిఅన్నారు. తక్షణమేఅవసరమైన చర్యలు తీసుకొని సాగు నీటిసరఫరా పద్ధతులను మెరుగుపరిచేందుకు తగిన చర్యలు చేపడతామని కలెక్టర్‌స్పష్టం చేశారు.ఈకార్యక్రమంలో ఇరిగేషన్ ఈ.ఈ రహీముద్దీన్,వ్యవసాయ అధికారి సక్రియనాయక్, ఏడీఏ సంగీత లక్ష్మి ,విద్యుత్ శాఖ ఎ.డి.రమేష్ బాబు, సంబంధిత అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు

బిజినేపల్లి, మార్చి13 ప్రభాతవార్త: వట్టెం శ్రీ వేంకటేశ్వరస్వామి 39వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజు గురువారం భక్తి కార్యక్రమాలు అత్యంత వైభవంగా, శాస్త్రోక్తంగా ఆస్థాన యజ్ఞాచార్యులు శ్రీమనారాయణా చార్యుల బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం హోమశాలలో ప్రత్యేక యజ్ఞం, అనంతరం గరుడ పతాక ధ్వజారోహణం జరిగింది. సంతాన ప్రాప్తి కొరకు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన దంపతుల పల్లకి సేవ అనంతరం పవిత్ర గరుడ ప్రసాదం అందజేశారు. ముందురోజు నుండేఎంతో విశ్వాసంతో, నిష్టతో ఉపవాసం వుండి దంపతులు పవిత్ర గరుడ ప్రసాదాన్ని స్వీకరించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్చారణ మధ్య తిరుచ్చిసేవ నిర్వహించారు. శేష వాహనంపై స్వామివారిని ఊరేగించారు. శుక్రవారం ఉత్సవమూర్తులకు నవ కలశ స్థాపనం, తిరుమంజనం సాయంత్రం ఎదుర్కోళ్ల ఉత్సవం,హనుమ ద్వాహనంపై స్వామివారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. కార్యక్రమాల్లో సందడి ప్రతాప్ రెడ్డి, సందడి రామచంద్రారెడ్డి, కొర్త చంద్రారెడ్డి, భాస్కరాచారి, చెన్నకృష్ణారెడ్డి తదితరులు పాల్గొని భక్తుల ఏర్పాట్లను, ఉత్సవ తీరును పర్యవేక్షించారు.

ఘనంగా శ్రీలక్ష్మినరసింహస్వామి కళ్యాణోత్సవం

ఉప్పునుంతల, మార్చి 13 ప్రభాతవార్త: మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మినరసింహ స్వామికల్యాణోత్సవం కన్నుల పండుగగా జరిగింది. వేద పండితుల మధ్య కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది.కళ్యాణోత్సవాన్ని తిలకిచ్చేందుకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.వధువు తరపున,వరుడు తరపున కూర్చొని కళ్యాణాన్ని జరిపించారు. కళ్యాణానికి ముందు ఉదయం 6 గం.ల నుంచి ఉదయం 9 గం.ల వరకు నిత్య హోమాలు, బలి హరణం, వికాస తరంగిణి వారిచే విష్ణు పారాయణం, గరుడ వాహన సేవ, తీర్థ ప్రసాద వితరణ మోహిని సేవ, ఉదయం 9.05 నిమిషాలకుఎదుర్కోళ్లు, ఉదయం10.16 నిమిషాలకుకళ్యాణోత్సవం జరిగింది.గురువారం వేదపండితుల మధ్యకళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు.కళ్యాణాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీశ్రీ రంగనాయక స్వామి రథోత్సవం

శ్రీరంగాపూర్, మార్చి 13 ప్రభాతవార్త: వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని శ్రీశ్రీరంగనాయక స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం రథోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది.ఈ రథోత్సవానికి ముఖ్య అతిథులుగా వనపర్తి రాజా కృష్ణ దేవరాయలు అదేవిధంగా ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డిలు హాజరయ్యారు. వీరికి వేదమంత్రాలతో పురోహితులు రాజేంద్రప్రసాద్ యాదవ్, శ్రీహరిరాజు, బీరం రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఘనంగా స్వాగతం పలికారు. శ్రీరంగనాయక స్వామిని దర్శించుకోవడానికి, రథోత్సవాన్ని తిలకించడానికి తండోపతండాలుగా భక్తులు కదిలి వచ్చారు. శ్రీరంగాపురం వాసులు, ప్రముఖులు చుట్టుపక్కల గ్రామాలలోని వారు, ఇతర రాష్ట్రాల భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. ఒక్కసారిగా జన సంద్రంలా మారిపోయింది. రెండు గోపురాలు, కోనేరు, జాతర అందరిని ఆకర్షితులను చేసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆరోగ్య కేంద్రం, దాహాన్ని తీర్చడం కోసం త్రాగు నీటి సౌకర్యం,అరటి పళ్ళు, పులిహోర, భక్తులకు అందుబాటులో ఉంచడం జరిగింది.శ్రీరంగనాయక స్వామి జాతర ఉత్సవాలు మార్చి 30 ఉగాది పండుగ వరకు 15 రోజులు కొనసాగుతాయి.

పదవ బెటాలియన్‌లో చిల్డ్రన్ పార్క్..

ప్రారంభించిన అడిషనల్ డిజిపి సంజయ్ కుమార్ జైన్

ఇటిక్యాల, మార్చి 13 ప్రభాతవార్త: పోలీసులు విధులతో పాటు వారి కుటుంబాలకు మానసిక ప్రశాంతత కు క్రీడలు వంటివి అవసరమని పదవ బెటాలియన్ పనిచేసే అధికారులు. పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి బెటాలియన్ సంక్షేమం కొరకు పనిచేయాలని అడిషనల్ డిజిపి సంజయ్ కుమార్ జైన్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఎర్రవల్లి చౌరస్తాలో గలపదవ బెటాలియన్‌లో జోగులాంబ గద్వాల జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు. కమాండెంట్ ఎన్‌వి సాంబయ్య తో కలిసి పోలీస్ కుటుంబ సభ్యుల సంక్షేమం,పిల్లల కొరకు నూతనంగా నిర్మించిన చిల్డ్రన్ పార్కును వారు ప్రారంభించారు. అలాగే ఇతర అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు.అనంతరం బెటాలియన్ సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బెటాలియన్‌లో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు పోలీస్ సిబ్బందివిధినిర్వహణ ఒంటి సమస్యలను కమాండెంట్ సాంబయ్యతో చర్చించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ జయరాం, అసిస్టెంట్ కమాండెంట్లు నరేందర్ రెడ్డి, శ్రీనివాసులు, పాణి,రిజర్వు ఇన్స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, రాజారావు, రమేష్ బాబు, శ్రీధర్ ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జెపీఎన్‌సీఈలో ఇఫ్తార్ విందు

ఒబేదుల్లా కొత్వాల్‌కు పండ్లు తినిపిస్తున్న కళాశాల చైర్మన్ రవికుమార్

మహబూబ్‌నగర్, మార్చి13, ప్రభాతవార్త: పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా జెపీఎన్‌సీఈ కళాశాలలో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కళాశాల చైర్మన్ కేఎస్ రవికుమార్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుల